



పవన్ అందరికీ చెప్పలేరు కదా?

రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు, బాలికల ఆచూకీ తెలియకుండా పోయిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎప్పటి నుంచో నెత్తీ నోరు బాదుకుంటూనే ఉన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పరిస్థితి మరీ దుర్లభంగా మారిపోయిందని ఆవేదన చెందుతూనే ఉన్నారు. అయినా జగన్ జమానాలో పట్టించుకున్న దాఖలాలు లేవు. గణాం కాలను పరిశీలిస్తే ఆయన ఎందుకు అంత బాధ పడు తున్నారో అర్థమవుతుంది. 9 నెలల కిందట అదృశ్యమైన ఓ యువతి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఎక్కడో జమ్మూలో ఉన్న అమ్మాయిని చిన్న క్లూతో పోలీసులు 48 గంటల్లో గుర్తించారు. మరి మిగతా కేసుల్లో ఎందుకు తాత్సారం జరుగుతోంది? దర్యాప్తులో వేగం ఎందుకు ఉండడం లేదు? అదృశ్యం కేసులను ఎందుకు చులకనగా చూస్తున్నారు? అనేవి ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి.వ్యవస్థలు ఎన్ని ఉన్నా ఆడపిల్ల తల్లిదండ్రులకు అవస్థలు తప్పడం లేదనేది బహిరంగ వాస్తవం.

2016 నుంచీ 560 మంది..

అదృశ్యం కేసుల్లో గణాంకాలను పరిశీలిస్తే ఒళ్లు గగుర్పాటుకు గురౌతుంది. 2016 నుంచీ ఉమ్మడి, విభజిత తూర్పుగోదావరిలో నేటి వరకూ బాలలు 21, బాలికలు 70, పురుషులు 249, మహిళలు 220 మొత్తంగా 560 మంది ఆచూకీ దొరకలేదు. గడిచిన ఐదేళ్లలో 18 మంది బాలికలు, 178 మంది యువతులు ఏమైపోయారో ఇప్పటికీ తెలియలేదని పోలీసు గణాంకాలు చెబుతు న్నాయి. ఆచూకీ దొరకని వారిలో మైనర్లు ఉండడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది. 2016లోని కేసు కూడా ఇంకా పరిష్కారం కాలేదు.

రాజమండ్రి త్రీటౌన్ ప్రథమం..

ఏకంగా 89 అదృశ్యం కేసుల పెండింగ్‌తో రాజమండ్రి 3 టౌన్ పోలీస్ స్టేషన్ మొదటి స్థానంలో ఉంది. తర్వాత రాజానగరం, బొమ్మూరు ఉన్నాయి. సిటీ పరిధిలో ఉన్న రాజమండ్రి 1టౌన్,2టౌన్, 3టౌన్, ప్రకాశంనగర్, బొమ్మూరు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో 198 మంది ఆచూకీ నేటికీ దొరకలేదు. అయితే ఆన్‌లైన్‌లో, రికార్డులు అప్‌డేట్ చేయనివి 560 కేసుల్లో కొన్ని ఉంటాయని పోలీసులు చెబుతున్నారు. 70 మంది బాలికల అదృశ్యం కేసులు జాబితాలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది.



మళ్లీ ఎన్నికలు

- 20న ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ ఎన్నికలు
- నోటిఫికేషన్ జారీ చేసిన అధికారులు
- 11వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ
- చివరిగా 2013లో ఎన్నికలు
- చైర్మన్ రేసులో చల్లా శంకరరావు
- వైసీపీ పోటీలో ఉంటుందా?

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిష్టాత్మకమైన ఆర్యాపురంఅర్బన్ బ్యాంక్ ఎన్నికల సందడి మొదలైంది..తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి ప్యానల్ కూడా సిద్ధమైంది. రేపోమాపో వారి పేర్లను ప్రకటించనున్నారు. మొత్తం 12 మంది డైరెక్టర్ల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి.అందులో రెండేసి సీట్లు తమకు ఇవ్వాలని జనసేన, బీజేపీ వర్గాలు పట్టుబడుతున్నాయి. కానీ టీడీపీ చెరొకటి ఇస్తామని చెబుతు న్నట్టు సమాచారం. దీనిపై రేపో మాపో స్పష్టత రానుంది. చైర్మన్ పదవి రేసులో అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ చల్లా శంకరరావు రేసులో ఉన్నారు.ఇక ప్రతిపక్ష వైసీపీ ఓటమి భారంతో బాధపడుతోంది. సొంతంగా ప్యానల్ కట్టే పరిస్థితి కనిపించడంలేదు. ఇటీవల కొందరు దీనిపై చర్చించుకున్నారు. మాజీ ఎంపీ మార్గాని భరత్, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను కొందరు కలిసి పోటీపై చర్చించినట్టు సమాచారం.కానీ ఇంకా స్పష్టత లేదు. మరొక పక్క వామపక్షాలు, ఇతర పార్టీలు పాలకవర్గ ఎన్నిక ఏకగ్రీవం కావాలని పట్టుబడుతున్నారు. టీడీపీ కూటమి మాత్రం ఎన్నికలకైనా సిద్ధమవుతోంది. ఎన్నికలు జరుగుతాయా, పాలకవర్గం ఏకగ్రీవం అవుతుందా అనేది తేలనుంది. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ఈ ఎన్నికల కోసం వివిధ వర్గాలతో మంతనాలు జరుపుతున్నారు. కూటమి నేతలుగా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, జనసేన సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ జోక్యంతో కూటమి అభ్యర్థుల ఎంపిక ఖరారయ్యే అవకాశం ఉంది.

11న నామినేషన్ల స్వీకరణ.. 20న పోలింగ్

అర్బన్ బ్యాంక్‌కు గురువారం ఎన్నికల అధికారి వి. కృష్ణకాంత్ నోటిఫికేషన్ జారీ చేశారు. చివరగా 2013లో ఎన్నికల జరిగాయి. 2018లో తిరిగి జరగాలి. అప్పటి నుంచి వాయిదా పడింది. ప్రస్తుతం ఎన్నికలకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 11 నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు.11వ తేదీ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. అదే రోజున ఎన్నికల అధికారి దాఖలైన నామినేషన్ల వివరాలు ప్రకటిస్తారు. 12వ తేదీ ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్క్రూట్నీ ఉంటుంది. తుది జాబితా ప్రకటిస్తారు.20వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. 22న కొత్తపాలకవర్గం సమావేశమైన కొత్త చైర్మన్‌ను ఎన్నుకుంటారు. రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ సుమారు రూ.1080 కోట్ల టర్నోవర్‌తో మొత్తం 16 బ్రాంచిలు ఉన్నాయి. రాజమహేంద్రవరం మెయిన్ బ్రాంచి,కాతేరు, తిలక్‌రోడ్‌లోని స్వరాజ్‌నగర్, కోటగుమ్మం, బొమ్మూరు, దానవాయిపేట, దివాన్‌చెరువు, జెఎన్‌రోడ్డుతో 9 బ్రాంచిలు రాజమహేంద్రవరంలోనే ఉన్నాయి.గుంటూరు, తాడేపల్లిగూడెం, భీమవరం,విశాఖ,తణుకు,అమలాపురం,కాకినాడలలో ఒక్కో బ్రాంచి ఉన్నాయి. 78423 మంది ఓటర్లు ఉన్నారు.రహస్య బ్యాలెట్ పద్ధతిలో మొత్తం 12 మంది డైరెక్టర్లును ఎన్నుకుంటారు. ఎన్నికైన 12 మంది డైరెక్టర్లు కలసి చైర్మన్‌ను ఎన్నుకుంటారు. మొత్తం ఆర్యాపురం బ్యాంక్ పరిధిని మూడు నియోజకవర్గాలుగా విభజించారు.1వ నియోజకవర్గం రాజమహేంద్రవరం బ్రాంచిల పరిధి లోని ఓటర్లు 10మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు.ఎక్కువ ఓటర్లు ఇక్కడే ఉంటారు.కాకినాడ, తాడేపల్లిగూ డెం,తణుకు బ్రాంచిలకు ఒక డైరెక్టర్,దివాన్‌చెరువు, భీమవరం, అమలాపురం,వైజాగ్ (సీతమ్మధార), గుంటూరు బ్రాంచిలకు ఒక డైరెక్టరును ఎన్నుకుంటారు.



ఏమైపోతున్నారు.. వీళ్లు!

పెరుగుతున్న అదృశ్యం కేసులు

అదృశ్యం అవుతున్న వారంతా ఏమైపోతున్నారు? వ్యభిచార కూపాల్లో చిక్కుకున్నారా?.. వెట్టిచాకిరీలో మగ్గుతున్నారా?.. బాల కార్మికులుగా నలిగిపోతున్నారా?.. ఎవరి కబంధ హస్తాల్లో అయినా చిక్కుకుపోయారా?.. ఇప్పటికే దేశం దాటించేశారా?.. ఇంటికి రావడానికి ముఖం చెల్లక అల్లాడిపోతున్నారా?.. ఎవరైనా నమ్మించి 'అవసరం' తీర్చుకొని నడి రోడ్డుపై వదిలేస్తే జీవచ్ఛవాల్లా మిగిలిపోయారా? అసలు ఊపిరితో ఉన్నారా?.. ఇలాంటి ప్రశ్నలు బాధిత తల్లిదండ్రులకు ప్రతిక్షణం నరకం చూపిస్తున్నాయి. ఎక్కడ ఉన్నా తమ పిల్లలు క్షేమంగా ఉన్నారనే సమాచారం ఏదో నిమిషంలో అందుతుందనే నమ్మకంతో పోలీసు శాఖ కబురు కోసం ఎదురు చూస్తున్న పండుటాకులు ఎన్నో ఉన్నాయి. వివాహితలు ఇల్లు విడిచి వెళ్లిన సందర్భాల్లో తల్లి కోసం పిల్లలు అల్లాడిపోతున్న ఘటనలు హృదయాన్ని ద్రవింపజేస్తున్నాయి. జిల్లాలో ఒక్కటా రెండా 2016 నుంచి చూస్తే 560 మంది అదృశ్యమైపోయారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బాలికలు, మహిళల అదృశ్యం కేసులు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి.. రక్షణగా ఉండాల్సిన వ్యవస్థలు అందరినీ ఒకే గాటన కట్టేసి దర్యాప్తుల్లో జాప్యం చేయడం వల్ల చాలా మంది ఏ కూపంలో కూరుకుపోయారో ఇప్పటికీ సమాధానం లేని ప్రశ్నగానే మిగిలిపోయింది. ఆడవారికి రక్షణ కల్పించలేని దుస్థితి మౌనంగా వెక్కిరిస్తోంది. కారణాలేమైనా కనబడకుండా వెళ్లిపోతున్నారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల కంటే రెండింతలు వెలుగు రాని ఘటనలు ఉంటాయని చెబుతున్నారు. పరువు పోతుందని, చుట్టాల్లో చులకన అయిపోతామని, నాలుగు రోజుల్లో తిరిగి వచ్చేస్తారని.. ఇలా రకరకాల కారణాలతో సరిపుచ్చుకుంటూ ఏ క్షణంలోనైనా ఇంటి తలుపు తడతారనే ఆవేదనతో ఏడ్చి ఏడ్చి నీరు ఇంకిపోయిన కళ్లతో నిస్తేజ స్థితిలో ఎదురు చూస్తూ బతుకీడ్చే వాళ్లూ ఉన్నారు. అయితే, అదృశ్యమైన వారి ఆచూకీ పసిగట్టడం నిజంగా పోలీసులకు పెద్ద చిక్కుముడే. కానీ విప్పలేనంత కఠినమైన ముడి మాత్రం కాదు. 2016లోని కేసులో ఇప్పటికీ ఆచూకీ లభించలేదు. ప్రతి రోజూ అదృశ్యం కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ఇదిలా ఉండగా యువతుల ఆచూకీని గుర్తించడానికి ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించడంతో కన్నపేగును మళ్లీ చూసుకోగలమన్న గంపెడంత ఆశ బాధిత తల్లిదండ్రుల్లో చిగురిస్తోంది. ఆడపిల్లలు, మహిళల అదృశ్యంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

2016 నుంచి కేసులిలా..

స్టేషన్	బాలురు	బాలికలు	పురుషులు	స్త్రీలు	మొత్తం
అనపర్తి	0	4	12	4	20
బిక్కవోలు	0	0	6	1	7
బొమ్మూరు	1	5	17	16	39
చాగల్లు	1	3	5	8	17
దేవరపల్లి	0	2	5	8	15
ధవళేశ్వరం	0	2	10	9	21
గోకవరం	0	2	4	5	11
గోపాలపురం	0	5	2	3	10
కడియం	0	3	9	7	19
కోరుకొండ	0	4	4	2	10
కొవ్వూరురూరల్	0	1	3	10	14
కొవ్వూరు టౌన్	4	2	20	12	38
నల్లజర్ల	0	2	9	9	20
నిడదవోలు	1	1	5	4	11
పెరవలి	0	2	9	5	16
ప్రకాశంనగర్	2	2	7	2	13
రాజమండ్రి1	0	6	13	17	36
రాజమండ్రి2	0	0	13	8	21
రాజమండ్రి 3	7	9	38	35	89
రాజానగరం	2	5	25	23	55
రంగంపేట	0	1	4	0	5
సమిశ్రగూడెం	1	1	4	8	14
సీతానగరం	1	5	10	9	25
తాళ్లపూడి	0	2	3	6	11
ఉండ్రాజవరం	1	1	12	9	23
మొత్తం	21	70	249	220	560

- 8 ఏళ్లలో 560 మంది జాడలేరు
- వీరిలో 220 మంది మహిళలు
- సెల్‌ఫోన్, స్నేహితుల ప్రభావం
- అదృశ్యం కేసులపై తీవ్ర జాప్యం
- 2016లో కేసూ ఇంకా తేలలేదు
- అదృశ్య కేసులపై ప్రత్యేక బృందం
- పవన్ కల్యాణ్ ప్రకటన
- తల్లిదండ్రుల్లో చిగురిస్తున్న ఆశలు

సెల్‌ఫోన్ భూతం

సెల్‌ఫోన్‌ల వల్ల ఉపయోగం ఏ మాత్రం ఉందోగానీ.. ఆడవాళ్ల జీవితాలు మాత్రం చిక్కుల్లో పడిపోతున్నాయి. సెల్‌ఫోన్‌ల వల్ల సంసారాలు కూలిపోతున్నాయి. కొంత మంది వివాహితలు 'ఇతరుల' ఊబిలో కూరుకుపోయి కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. సెల్‌ఫోన్ లేదా వేరే మార్గాల ద్వారా పరిచయమైన వ్యక్తి చెప్పే మాయ మాటలు, తీపి కబుర్లే జీవితం అనుకొని వెళ్లిపోయి..జీవితం ముళ్లకంపలో ఇరుక్కుపోయిందని కొద్ది రోజులకు తెలుసుకొని రోదిస్తున్నారు. మరికొంత మంది భర్త వేధింపులు తాళలేక ఆ నరకం నుంచి బయటకు వెళ్లిపోతున్నారు..అమ్మా నాన్న చదవమంటున్నారని కొంత మంది విద్యార్థినులు..ఇంట్లో స్వేచ్ఛలేదని మరికొంత మంది..మాయమాటలకు లోబడి ఇంకొంతమంది తమ జీవితా లను పణంగా పెడుతున్నారు. విద్యార్థినులు ఇల్లు విడిచి వెళుతున్న కేసుల్లో ఎక్కువగా స్నేహితులు, సెల్‌ఫోన్‌ల ప్రమేయం ఉంటోందని నిపుణులు చెబుతున్నారు.

ఎక్కడికక్కడ ఆరా ఉండాల్సిందే..

బాలబాలికలు, యువతులు, మహిళల కేసుల్లో ఫిర్యాదు అందిన వెంటనే రంగంలోకి దిగే విధంగా రక్షణ వ్యవస్థలు మెరుగు పడాల్సిన అవసరం కనిపిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం పూర్తిగా ఉపయోగించుకొని త్వరితగతిన ఆచూకీ కనిపెట్టే ఏర్పాట్లు జరగాల్సి ఉంది. ఆచూకీ దొరికిన తర్వాత వారిని సురక్షితంగా తీసుకొచ్చి, తగిన కౌన్సెలింగ్ చేసి తల్లిదండ్రులకు అప్పగించాలి. అలాగే ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి.వాటిలో గ్రామ పోలీస్ ఉన్నారు. వారిని గ్రామం నుంచి బస్సు, ఆటోలు లేదా ఇతర వాహనాల్లో ఊరి నుంచి బయటకు ఒంటరిగా వెళ్తున్న ఆడవారిపై నిఘా పెట్టే విధానం రావాలి. అనుమానం వస్తే ప్రశ్నించి వివరాలు సేకరించారు. కొత్తగా యువకులు, యువతులు కనిపిస్తే ఆరా తీయాలి. రవాణాకు గేట్‌వేలా ఉండే రాజమహేంద్రవరం వంటి సిటీల్లోని బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద నిఘా పెంచాలి. ఈ పనులకు మహిళా పోలీసులను వినియోగించుకోవడం లేదా మహిళా సిబ్బందిని నియమించుకోవడం చేస్తే మేలు జరిగే అవకాశం ఉంటుంది.

తీరు గమనిస్తూ ఉండాలి : ఎస్పీ జగదీశ్



అదృశ్యం కేసులపై పూర్తిగా దృష్టి సారించాం.రెండు రోజుల కిందట డీజీపీ కూడా స్పష్టమైన ఆదేశాలిచ్చారు. కొన్ని కేసులను క్షుణ్ణంగా అధ్యయనం చేశాం. దాదాపు 20 వరకూ కారణాలను గుర్తించాం.వాటి ఆధారంగా ముందుకు వెళ్లబోతున్నాం.పిల్లల తీరును పెద్దవాళ్లు ఎప్పటికప్పుడు స్కూల్, కళాశాల, పని ప్రదేశాల్లో ఆరా తీస్తూ ఉండాలి. సెల్‌ఫోన్లను, సోషల్ మీడియా వాడకాన్ని గమనిస్తూ ఉం డాలి. ఏదైనా ఇబ్బంది ఉంటే ముందు మంచిగా, జరగబోయే నష్టం గురించి చెప్పి చూడాలి. అప్పటికీ వినకపోతే పోలీసులను ఆశ్రయించవచ్చు.ఈ విషయంలో సమాజం కూడా తన పాత్ర పోషించాలి. ఎవరైనా అనుమానాస్ప దంగా కనిపిస్తే దగ్గరలోని పోలీసులకు సమాచారం ఇవ్వడం బాధ్యతగా గుర్తె రగాలి. అదృశ్యం కేసులను తగ్గించడానికి పోలీసుల వైపు నుంచి అన్ని చర్యలూ తీసుకుంటున్నాం.





జిల్లా ఆసుపత్రిలో.. జలగలు..

జీజీహెచ్‌లో ఎంఎన్‌వోల బరితెగింపు!

- పేద రోగులను జలగల్లా పీడిస్తున్న వైనం
- ఎంఆర్ఐ, సీటీస్కాన్‌లకు డబ్బులు
- ఆర్థోపెడిక్, క్యాజువాలిటీ డ్యూటీ పండగే
- రోజుకు రూ.3 వేలు అదనపు సంపాదన
- వైద్యాధికారుల చర్యలు శూన్యం
- కలెక్టరమ్మా కాస్త ఇటు చూడమ్మా

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 4 : కడియం మండలం వీరవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అనారోగ్యంతో బుధవారం రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు వచ్చాడు. కడియం ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఎంఆర్ఐ చేయించుకోవాలని సూచించడంతో జీజీహెచ్‌కు వచ్చి ఓపీ చీటి రాయించుకున్నాడు. ఎంఆర్ఐ స్కానింగ్ కోసం అక్కడున్న ఒక ఎంఎన్‌వోను సంప్రదించాడు. ఆ ఎంఎన్‌వో రూ.2 వేలు డిమాండ్ చేయడంతో అతనికి ఒక్కసారిగా కళ్లుబైర్లు కమ్మాయి. రోగంతో ఆసుపత్రికి వస్తే డబ్బులు డిమాండ్ చేస్తారా అంటూ ఆ వ్యక్తి ఆసుపత్రి బయట పెద్ద పెద్ద కేకలు వేయడంతో అక్కడున్న మరో ఎంఎన్‌వో అతనికి సర్దిచెప్పాడు. ముందు వైద్యం చేయించుకో అంటూ నచ్చచెప్పి పంపేశాడు..

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో కొందరు ఎంఎన్‌వోల (మేల్ నర్సింగ్ ఆర్డర్లీ) వసూళ్ల భాగోతం. ఇలా ఈ ఒక్క సంఘటన వెలుగు చూసినా .. బయటకు రాని అనేక వ్యవహారాలు జీజీహెచ్‌లోని ఎంఎన్‌వో విభాగంలో నిత్యకృత్యమవుతున్నాయి. ఎంఎన్‌వోల చేతులు తడిపితేనే కానీ రోగులకు వైద్యం అందని పరిస్థితి నెలకొంది. రూ.50, రూ.100 కాదు వేల రూపాయలు డిమాండ్ చేస్తుండడంతో పేదలు, సామాన్యులు వైద్యానికి ముడుపులు ఇచ్చుకోలేక పెద్దాసుపత్రి అంటేనే హడలిపోతున్నారు. ఎంఆర్ఐ, సీటీ స్కాన్, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎక్స్‌రే ఇలా అనేక పరీక్షలకు దర్జాగా డబ్బులు గుంజేస్తున్నారు. ఎంఎన్‌వోలు పేద రోగులను డబ్బుల కోసం జలగల్లా పట్టిపీడిస్తున్నా జీజీహెచ్ అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. అసలు ఎంఎన్‌వోలకు డ్యూటీలు వేసే సూపర్‌వైజర్ పైనా గతంలో అనేక ఆరోపణలున్నా పై అధికారులు పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఒకరికి బదులు మరొకరు ఉద్యోగం చేస్తున్నారంటూ కొద్ది రోజుల కిందట సూపర్‌వైజర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో ఆర్ఎంలతో కమిటీ వేసి విచారణ జరిపించారు. ఆ నివేదిక ఏమైందో, ఏం చర్యలు తీసుకున్నారో కూడా తెలియని దుస్థితి జీజీహెచ్‌లో దాపురించింది. అధికారులు ఎవరిపైనా చర్యలు తీసుకోకపోగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తినే మళ్లీ సూపర్‌వైజర్‌ను చేయడంతో ఎంఎన్‌వోల వసూళ్లకు అధికారులు పరోక్షంగా లైసెన్సు ఇచ్చినట్టయిందని వైద్య ఉద్యోగుల్లో చర్చించుకుంటున్నారు.

ఎంఎన్‌వోలదే కీలకపాత్ర..

తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారు, వృద్ధులు, నడవలేని పరిస్థితిలో వైద్యం కోసం వచ్చే రోగులకు ఎంఎన్‌వోలు తక్షణ సహాయం అందించాల్సి ఉంటుంది. క్యాజువాలిటీ ప్రధాన ద్వారం నుంచి వీల్‌చైర్, స్ట్రెచర్ వంటి వాటి ద్వారా వారిని ఆసుపత్రిలోపలకు తీసుకువచ్చి డాక్టర్లకు చూపించాల్సి ఉంటుంది. వైద్యుడు చూసిన తర్వాత అవసరమైతే వారిని ఇన్‌పేషెంట్లుగా అడ్మిట్ రాస్తే ఆయా వార్డుల్లో చేర్పించాల్సి ఉంటుంది. అలాగే ఇన్‌పేషెంట్లుగా ఉన్నవారికి ఎక్స్‌రే, ఈసీజీ, ఎంఆర్ఐ, సీటీ స్కాన్ వంటి టెస్ట్‌లు రాస్తే రోగిని అక్కడకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. అలాగే ఓపీలో డాక్టర్‌కు చూపించుకునే వృద్ధులు, నడవలేని వారికి సహాయం చేయాల్సి ఉంటుంది. డాక్టర్‌కు సహాయకునిగాను వ్యవహరించాలి. కట్లు కట్టడం, గాయాలను శుభ్రం చేయడం, ప్రాథమిక వైద్యసేవలు వంటి విధులు నిర్వర్తించాలి. కొందరు ఎంఎన్‌వోలు కేవలం డాక్టర్లకు మాత్రమే సహాయకులుగా వ్యవహరిస్తూ పైరవీలు సాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇన్‌పేషెంట్లు, ఇతర రోగులను టెస్టులకు తీసుకెళ్లి, మరలా తీసుకురావడానికి బాధిత కుటుంబీకులనుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులున్నాయి.

ఆ డ్యూటీలకు మంచి గిరాకీ ..

జీజీహెచ్‌లోని క్యాజువాలిటీ, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ వంటి కీలక విభాగాలతో పాటు మరికొన్ని చోట్ల ఎంఎన్‌వో డ్యూటీలకు విపరీతమైన గిరాకీ ఉంటుంది. ఇక్కడ డ్యూటీలు పడితే ఆ ఎంఎన్‌వోలకు పండగే. ఎందుకంటే ఒకొక్కరు ఎంత లేదన్నా రోజుకు రెండు, మూడు వేలు ఇంటికి పట్టుకెళతారని ఎంఎన్‌వో ఉద్యోగుల్లోనే ప్రచారంలో ఉంది. అందుకే ఇక్కడ డ్యూటీ వేయించుకోవడానికి వారం వారం గోకవరం నుంచి నాటుకోళ్లు, వేట మాంసాలు, కూరగాయలు వంటివి సమర్పించుకోవాల్సిందేనసే ప్రచారం జీజీహెచ్‌లో గుప్పుమంటోంది. జీజీహెచ్ ఉన్నతాధికారులు ఒక్కసారి ఎంఎన్‌వోల అటెండెన్స్ రోస్టర్ పరిశీలిస్తే ఈ డ్యూటీల భాగోతం వెలుగు చూసే అవకాశం ఉన్నా అవేమీ పట్టించుకున్న దాఖలా లేవు. దీంతో కొందరు ఎంఎన్‌వోలు దండుకోవడంలో దూకుడు చూపిస్తున్నారు. ఇదేంటని రోగులు, వారి సహాయకులుగాని, ఇతరులు ఎవరైనా అడిగితే వారిపైనా దౌర్జన్యం చేయడానికి కూడా వెనుకాడడంలేదంటే పరిస్థితులు ఎంత అదుపుతప్పాయో అర్థమవుతోంది.

మొత్తం 45 మంది..

రెగ్యులర్, ట్రామాకేర్, జీడీఏలు (జనరల్ డ్యూటీ అటెండెంట్లు) కలిపి మొత్తం 45 మంది ఎంఎన్‌వోలుగా జీజీహెచ్‌లో పనిచేస్తున్నారు. వీరిలో నలుగురు రెగ్యులర్, ఏడుగురు ట్రామాకేర్ మినహా మిగిలిన వారంతా జీడీఏలే ఉన్నారు. జీడీఏల్లో 8 మందిని ఆఫీసులో సహాయకులుగా నియమించారు. మిగిలిన వారంతా ఎంఎన్‌వోలుగా పనిచేస్తున్నారు. ఎంఎన్‌వోలు, జీడీఏలకు నెల రోజులకు ఒకసారి డ్యూటీ రోస్టర్ అమలు చేస్తుంటారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ, 2 నుంచి రాత్రి 8 గంటల వరకూ, రాత్రి 8 నుంచి మర్నాడు ఉదయం 8 గంటల వరకూ షిఫ్టులుగా పనిచేస్తుంటారు. రోస్టర్ ప్రకారం మొదటి షిఫ్టులో సుమారు 20 మంది వరకూ ఎంఎన్‌వోలు పనిచేస్తున్నా రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు లభించడంలేదు సరికదా వీరిలో కొందరిపై తీవ్రమైన డబ్బుల వసూళ్ల ఆరోపణలున్నాయి. నెలలో పదిరోజులకు ముగ్గురు చొప్పున జీడీఏలకు ప్రత్యేకంగా ఎమర్జన్సీ ఓపీ రిజిస్ట్రేషన్ వేస్తున్నా వీరంతా ఎక్కడ విధులు నిర్వర్తిస్తున్నారనేది ప్రశ్నార్థకం.ఈ పరిస్థితుల్లో కాస్త ఇటు చూడమ్మా అంటూ కలెక్టర్‌ను పేద రోగులు దీనంగా వేడుకుంటున్నారు.




అల్లూరు సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల, బత్తుల, కలెక్టర్ ప్రశాంతి తదితరులు

అల్లూరికి ఘన నివాళులు

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 4 : స్వాతంత్ర్యం నా జన్మహక్కుని ఆచరణలో చూపిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని పురస్కరించుకుని గురువారం ఉదయం గోదావరి గట్టున గల అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ వేడుకలను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రస్థాయి వేడుకలుగా జరిపించాలని నిర్ణయం తీసుకోవడం పట్ల సీఎం చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి ఎస్పీ ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతి, మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బల రామకృష్ణ,ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి,వి.స్వామినాయుడు, అడిషనల్ ఎస్పీలు అనీల్ కుమార్, రాజశేఖర్ రాజు, ఎస్బీ డీఎస్పీ ప్రభాకర్, ఏఆర్ డీఎస్పీ టీవీఆర్‌కే కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సూర్య అప్పారావు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్.రఘురాం పాల్గొన్నారు.

బిక్కవోలు ఎంపీపీ జ్యోతిర్మయి రాజీనామా



బిక్కవోలు, జూలై 4 : బిక్కవోలు ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయిశేషుకుమారి తన ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. కొమరిపాలెం-2 ఎంపీటీసీగా ఎన్నికైన జ్యోతిర్మయిని ఎంపీటీసీ సభ్యులందరూ ఎంపీపీగా ఎన్నుకున్నారు. అయితే ఆమె వ్యక్తిగత కారణాల వల్ల మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తూ ఈ నెల 3న జిల్లా పరిషత్ సీఈవోకు రాజీనామా లేఖను పంపడంతో వెంటనే ఆమోదించారు. తాత్కాలిక ఎంపీపీగా బిక్కవోలుకు చెందిన వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావును కొత్త ఎంపీపీగా ఎన్నుకునే వరకూ కొనసాగాలంటూ సీఈవో నుంచి గురువారం తమకు ఉత్తర్వులు వచ్చాయని ఎంపీడీవో వి. విజయలక్ష్మి తెలిపారు. ఇకపై జ్యోతిర్మయి ఎంపీటీసీ సభ్యురాలిగా కొనసాగుతారన్నారు. సీఈవో ఆదేశాల మేరకు త్వరలో ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తామని ఆమె వివరించారు. ఈ నెల 12న ఎంపీపీ బుద్దాల కన్నారావు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరవుతారన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం, జూలై 4(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈవో కె.వాసుదేవరావు తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న అన్ని కేటగిరీల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు http://nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైటులో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు సమర్పించాలన్నారు.ఉపాధ్యాయులు అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

న్యాక్‌లో ఉచిత ఎలక్ట్రీషియన్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

ధవళేశ్వరం, జూలై 4 : కేంద్రప్రభుత్వ పీఎంకేవీవై పథకం ద్వారా నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్‌లో(న్యాక్)లో హెల్పర్ ఎలక్ట్రీషియన్ కోర్సును ఉచితంగా నేర్పించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు రీజనల్ కో ఆర్డినేటర్ పి.మురళీధర్ తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాలు వయసు కలిగి కనీసం 10వ తరగతి చదివిన యువతీ యువకులు 34 రోజులు శిక్షణకు అర్హులన్నారు.శిక్షణ సమయంలోఉచిత వసతి, ట్రైనింగ్ మెటీరియల్‌తో పాటు కేంద్రప్రభుత్వ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు.ఈ కోర్సుల్లో చేరే విద్యార్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్‌తో పాటు ఆధార్,రేషన్‌కార్డు,3పాస్‌పోర్టు సైజు ఫొటోలు, బ్యాంక్ అకౌంట్‌తో దరఖాస్తు చేయాలన్నారు. వివరాలకు మాస్టర్ ట్రైనర్ ఎం. కనకదుర్గా మహాలక్ష్మిని 62811 14627 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బంద్ విజయవంతం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 4 : నీట్, నెట్ ప్రవేశపరీక్షలో నష్టపోయిన విద్యార్థులను ప్రభుత్వం ఆదుకోవాలని పీడీఎస్‌యూ, స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (వీ) నాయకులు డిమాండ్ చేశారు. ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండు సమీపంలోని బాలికల ఉన్నత పాఠశాల వద్ద ప్రదర్శన చేశారు. అనంతరం పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తారకేష్, పీడీఎస్‌యూ (వీ) జిల్లా కార్యదర్శి వి.శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యాసంస్థల బంద్ విజయవంతమైందన్నారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు భానుప్రసాద్, మణికంఠ, ఎస్ఎఫ్ఐ నాయకులు భాస్కర్, జ్యోతిర్మయి, సురేష్, కనక, నాగ చైతన్య, లహరి, ఎన్ఎస్‌యూఐ నాయకులు భరత్, సంజయ్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ భరత్ వాహనం దహనం చేసింది..
వైసీపీ కార్యకర్తే
7

మాజీ ఎంపీ మార్గాని భరత్ ప్రచార రథం దహనం

వైసీపీ కార్యకర్త 'ప్లానింగే'..

- ఎన్నికల్లో ఓడిపోయిన భరత్‌కు సానుభూతి తీసుకొచ్చేందుకు ప్రయత్నం
- పక్కా ప్రణాళికతో ప్రచార రథాన్ని తగలబెట్టిన వైనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కిశోర్‌కుమార్



విలేకర్లకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కిశోర్‌కుమార్

రాజమహేంద్రవరం, జూలై 4(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రచార రథాన్ని వైసీపీ కార్యకర్త.. అదీ భరత్ తండ్రి మార్గాని నాగేశ్వరరావు ముఖ్య అనుచరుడే తగలబెట్టేశాడు. దీనికి ప్రొఫెషనల్ క్రిమి నల్ కంటే తెలివిగా ఆలోచన చేయడం పోలీసులను కూడా ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ మేరకు వివరాలను ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిశోర్‌కుమార్ వెల్లడించారు. రాజమహేంద్రవరం వీఎల్ పురానికి చెందిన దంగేటి శివాజీ కొన్నేళ్ల నుంచి వైసీపీ కార్యకర్తే కాకుండా మార్గాని నాగేశ్వరరావుకు ముఖ్య అనుచరుడు. భరత్ కార్యాలయం ఉన్న మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోనే ఎక్కువ సమయం గడిపేవాడు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో భరత్ ఓడి పోవడంతో ఆవేదన చెందాడు. ఎలాగైనా ఏదో ఒకటి చేసి టీడీపీ వాళ్లపైకి నెపం నెట్టేయాలని, భరత్‌పై ప్రజల్లో సానుభూతి వచ్చే విధంగా చేయాలని పథకం వేశాడు. ఈ క్రమంలో గత నెల 28న శివ మరికొంతమంది కలిసి రాత్రి 10 గంటల వరకూ మార్గాని ఎస్టేట్స్‌లోని రచ్చబండ వద్ద మద్యం తాగారు. తర్వాత ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. రాత్రి 10.30 గంటల ప్రాంతంలో తన బైక్ నుంచి శివ ఒక ప్లాస్టిక్ కవర్లోకి పెట్రోలు తీశాడు. ఒక దుకాణంలో దోమల చక్రం, అగ్గిపెట్టె కొన్నాడు. దోమల చక్రం చిన్న ముక్క విరిచి దానికి నాలుగు అగ్గిపుల్లలు వెలిగే కొనను ప్లాస్టిక్ తాడుతో కట్టాడు. వీటిని తీసుకొని ప్రచార రథం వద్దకు వెళ్లాడు. ఎదుటవైపు టైరుపై పెట్రోలు ఉన్న కవర్‌ని ఉంచి.. దానిపై అగ్గిపుల్లలు కట్టిన భాగం పెట్టాడు. మరోవైపు దోమల చక్రం ముక్కను వెలిగించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇదంతా ఒక నిమిషంలో చేసేశాడు. దోమల చక్రం వెలుగుతూ వచ్చి అగ్గిపుల్లలు మండి ఆపై పెట్రోల్ కవర్‌కి నిప్పు అంటుకొని పెట్రోల్‌తో మంటలు చెలరేగాయి. ఇవన్నీ టైరుపై ఉండడంతో మరింత వేగంగా మంటలు వ్యాపించాయి. దీంతో ప్రచార రథం దగ్ధమైందని డీఎస్పీ వివరించారు. శివాజీకి అతని స్నేహితుడు బాలు ఫోన్ చేసి భరత్ ఆఫీసు వద్దకు పోలీసులు ఎందుకు వచ్చారని ప్రశ్నించాడన్నారు. అయితే ఏమీ తెలియనట్లు విషయం ఆరా తీస్తానని చెప్పి మార్గాని నాగేశ్వరరావుకు శివాజీ ఫోన్ చేశాడన్నారు. ఏమైందో తెలుసుకుంటానని చెప్పిన నాగేశ్వరరావు.. ఐదు నిమిషాల తర్వాత శివాజీకి ఫోన్ చేసి ఎవరో ప్రచార రథానికి నిప్పు పెట్టి కాల్చేశారని చెప్పారని డీఎస్పీ తెలిపారు. నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 435 కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అతడిపై చాలా ఏళ్ల క్రితం ఓ కేసు ఉన్నట్లు తెలుస్తోందని.. పూర్తి వివరాలపై ఆరా తీస్తున్నామన్నారు. కేసును మూడు రోజుల్లో ఛేదించిన బొమ్మూరు సీఐ ఎండీ ఉమర్, ఎస్ఐ బి.శ్రీను, ఆర్.అంకారావు, కె.జగన్మోహన్‌రావు(కొవ్వూరు టౌన్), హెచ్‌సీలు పి.వెంకటేశ్వరరావు(బొమ్మూరు), కె.సురేశ్‌బాబు(అనపర్తి), కానిస్టేబుళ్లు కె.సురేశ్‌బాబు(బొమ్మూరు), కె.తిరుమల యాదవ్(బిక్కవోలు) బృందాన్ని ఎస్పీ జగదీశ్ ప్రత్యేకంగా అభినందించారు.

మైండ్ బ్లోయింగ్ ప్లాన్

కేసును ఛేదించడానికి పోలీసులు చాలా కష్టపడాల్సి వచ్చింది. భరత్ కార్యాలయానికి దూరంగా ఉన్న ఒక షెడ్డులో ఈ రథాన్ని ఉంచారు. అక్కడి సీసీ కెమెరాలు అంతదూరం పని చేయవు. దీంతో ఓ స్కూలు వద్ద ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా కేసును ఛేదించారు. గతంలో తమ దర్యాప్తుల్లో ఎన్నడూ చూడని ప్లాన్‌ని నిందితుడు, వైసీపీ కార్యకర్త దంగేటి శివాజీ వేయడం చూసి నివ్వెరపోయారు. యూట్యూబ్‌లో వీడియోలు వెతికి ఈ ప్లాన్ ఎంచుకున్నట్లుగా తెలుస్తోంది. మామూలు ప్లాస్టిక్ కవరైతే వెంటనే కాలిపోతుందని అల్యూమినియం ఫాయిల్ కవర్‌లో పెట్రోలు నింపుకున్నాడు. దానిని వెలిగిస్తే ఒక్కసారిగా పెద్ద మంటలు వచ్చి జనం గుమిగూడతారని దోమల చక్రానికి అగ్గిపుల్లలు కట్టాడు. ఆ దోమల చక్రం నెమ్మదిగా వెలుగుతూ అగ్గిపుల్లల వద్దకు వచ్చే సరికి సమయం పడుతుంది. దీంతో ఎవరికీ అనుమానం రాదని ప్లాన్ వేశాడు. ఈ సరంజామాను వ్యానుపై పెడితే పెద్దగా ఫలితం ఉండదని టైరుపై ఉంచాడు. టైరు రబ్బరు కావడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. కాగా.. 28 రాత్రి ఘటన జరగ్గా 2వ తేదీన పోలీసులకు వైసీపీ నగరాధ్యక్షుడు అడపా శ్రీహరి ఫిర్యాదు అందజేయడంతో అప్పట్లోనే అనుమానాల వ్యక్తం కావడం గమనార్హం.

160 కిలోల గంజాయి స్వాధీనం

మోతుగూడెం, జూలై 4: డొంకరాయి పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న చెక్‌పోస్టు వద్ద గురువారం డొంకరాయి ఎస్ఐ శివకుమార్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేయగా 160 కిలోల గంజాయిని రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను, 2 ఆటోలను అదుపులోకి తీసుకున్నారు. పాల్వంచ గ్రామానికి చెందిన షేక్ అక్బర్ హైదరాబాద్‌కు చెందిన షేక్ ఖాజావలి నాలుగు రోజుల క్రితం భద్రాచలం నుంచి సీలేరుకు పాసింజర్‌లను ఎక్కించుకుని అనంతరం పాసింజర్‌లను సీలేరులో దింపి సీలేరులోనే నాలుగురోజులు జల్సాగా తిరిగారు. సీలేరులో ఒక వ్యక్తి వారి వద్దకు వచ్చి గంజాయి భద్రాచలం తీసుకెళ్తే రూ.30 వేలు కిరాయి ఇస్తామని చెప్పడంతో ఆటోలో 80 కిలోల గంజాయి చొప్పున రెండు ఆటోల్లో 160 కిలోల గంజాయి పెట్టుకుని గురువారం సీలేరు నుంచి భద్రాచలం బయలుదేరు తుండగా గంజాయి రవాణా చేస్తున్న సదరు రెండు ఆటోలను వెహికల్ చెకింగ్ చేస్తున్న డొంకరాయి ఎస్ఐ శివకుమార్ పట్టుకుని గెజిటెడ్ అధికారి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వెంకట నానాజీ, వీఆర్వో సందీప్‌ఆచార్యులు, సురేష్ సమక్షంలో సీజ్ చేసి షేక్ అక్బర్, షేక్ ఖాజావలిను అరెస్ట్ చేశారు. చింతూరు సీఐ గజేంద్రకుమార్ ఆదేశాల మేరకు రంపచోడవరం జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌కు రిమాండ్ నిమిత్తం తరలించారు.

100 కిలోల గంజాయితో అరెస్టు

చింతూరు, జూలై 4 : చింతూరు పోలీసులు గురువారం వంద కిలోల గంజాయితో పాటు రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. చింతూరు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు మేరకు.. చింతూరు పోలీసు స్టేషను ముందు వాహన తనఖీలు చేస్తుండగా తెలంగాణ వైపు వెళుతున్న రెండు కార్లు అనుమానాస్పదంగా కనిపించాయి. దీంతో కార్లను నిలువరించి విచారణ చేపట్టగా ఆయా కార్లలో ప్రయాణిస్తున్న వారు 100 కిలోల గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో గంజాయి తరలింపునకు పాల్పడ్డ నలుగురు నిందితులతో పాటు కార్లకు పైలట్‌గా వ్యవహరించిన మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా, తొర్రూర్ మండలం హరిపిరాల గ్రామానికి చెందిన హపవత్ రమేష్, అదే గ్రామానికి చెందిన బాణోత్ రవీందర్, ప్రకాశం జిల్లా కొండపి గ్రామానికి చెందిన మాదాల వెంకటేశ్వరరావు, ఒడిసా రాష్ట్రం, మల్కానగిరి జిల్లా అల్లూరికోటకు చెందిన మరిగెల వెంకటరావు, అదే గ్రామానికి చెందిన మరిగెల సత్తి, మరిగెల చంటిబాబు అరెస్టైన వారిలో ఉన్నారు. వారి నుంచి రూ. 1 లక్షా 40 వేలు కూడా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

డయేరియా నుంచి కోలుకుంటున్న వేద విద్యార్థులు



విద్యార్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న వైద్యులు

అన్నవరం, జూలై 4: అన్నవరం దేవస్థానంలో కలకలం రేపిన ఆగమ పాఠశాల విద్యార్థుల డయేరియాకు సంబంధించి పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. విద్యార్థులు వేగంగా కోలుకున్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రంగరాయ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ ఎస్.పి.ఎం డిపార్ట్‌మెంట్ అధికారి డాక్టర్ రుక్మిణి, డిప్యూటీ జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ సరిత శివసదన్ కాటేజీలో ఉన్న వేద విద్యార్థులను కలిసి ఆరోగ్యంపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. అదే విధంగా తాగునీరు, వంట పదార్థాల శాంపిల్స్‌ను గురువారం తీసుకుని వారి వెంట తీసుకెళ్లారు. శాంపిల్స్ రిపోర్టులు శుక్రవారం వస్తాయని తెలిపారు. ఇదిలాఉండగా విద్యార్థులు కోలుకోవడంతో 31 మందికి వారం రోజులు సెలవు మంజూరు చేసి తల్లిదండ్రుల చెంతకు పంపించే ఆలోచనలో ఉన్నారు. శుక్రవారం ఈవో రామచంద్రమోహన్ దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఆగమ పాఠశాల ప్రాంగణమంతా శానిటైజ్ చేసి మరింత పరిశుభ్రం చేసే పనులు అధికారులు చేపట్టారు. ఏఈవో కృష్ణారావు, సూపరింటెండెంట్ స్వామీజీ పర్యవేక్షణ చేస్తున్నారు.

తెరపైకి ఆ ఐదు పంచాయతీలు

నేడు తెలంగాణ సీఎంను కలవనున్న అఖిలపక్షం

ఎటపాక, జూలై 4: రాష్ట్ర పునర్విభజన సమయంలో భద్రాచలం మండలంలో భద్రాచలం రెవెన్యూ గ్రామం మినహా మిగిలిన గ్రామాలన్నీ పోలవరం ముంపు పేరుతో ఏపీ పరిధిలో కలిశాయి. గత దశాబ్ద కాలం నుంచి ఆ గ్రామాలు పాలనపరంగా ఏపీ పరిధిలో కొనసాగుతున్నాయి. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారడంతో విలీన అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఇప్పుడు ఆ ఐదు పంచాయతీలైన ఎటపాక, పిచుకలపాడు, కన్నాయిగూడెం, పురుషోత్తపట్నం, గుండాల గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలనే డిమాండ్ విన్పిస్తోంది. వారం రోజుల క్రితం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ ఐదు పంచాయతీలు తెలంగాణకు వస్తేనే భద్రాచలం పుణ్యక్షేత్రం అభివృద్ధి చెందుతుందని, ఆ పంచాయతీలను భద్రాచలంలో కలిపేందుకు ఏపీ ప్రభుత్వాన్ని అడుగుతామని చెప్పడంతో ఆ పంచాయతీల విలీన ప్రక్రియపై మరింత వేడి రాజుకుంటోంది. ఈక్రమంలోనే గుండాల, ఎటపాక, కన్నాయిగూడెం పంచాయతీలోని పలు గ్రామాల ప్రజలు రెండు రోజుల క్రితం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు వినతి పత్రం అందించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఏపీ పరిధిలో కలిసిన ఎటపాక, పిచుకలపాడు, కన్నాయిగూడెం, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలిపి, భద్రాచలం పుణ్యక్షేత్ర అభివృద్ధికి కృషి చేస్తామని ప్రస్తావించారు. అయితే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఈ డిమాండ్ ఇటీవల కాలంగా గట్టిగా విన్పిస్తోంది.

తెలంగాణ సీఎంను కలవనున్న అఖిలపక్షం, ప్రజాప్రతినిధులు

శుక్రవారం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని ఈ ఐదు పంచాయతీల్లోని అఖిలపక్ష నాయకులు, ప్రజా ప్రతినిధులు కలవనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి తమ గోడును వినిపించనున్నారు. ఏపీలో పాలనా పరంగా పడుతున్న ఇబ్బందులను తెలియజేస్తూ తమ గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని విన్నవించనున్నారు. ఆంధ్రా, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి భేటీ కానుండడంతో ఈ అంశం చర్చకు వస్తుందనే ఆశాభావంతో ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు.

దుర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజలు



గొల్లప్రోలు రూరల్, జూలై 4: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. జ్యేష్ఠబహుళ త్రయోదశి, తత్కాల చతుర్ధశి, మాసశివరాత్రి సందర్భంగా మహాగణపతిపూజ, మహాన్యాసపారాయణ, 11 రుద్రాలు, 21 రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నేరేడుపండ్లు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు, స్మార్త ఆగమ పండిత విద్యార్థులు అల్లంరాజు రామకృష్ణశర్మ, ఫణిశర్మ, చెరకూరి కారుణ్యశర్మ, కార్తీక్‌శర్మ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

కాశీ, అయోధ్య రైలు యాత్ర

కార్తీకమాసంలో కాశీ, అయోధ్య నైమిశారణ్యం, చిత్రకూటం, అలహాబాద్, వింధ్యాచలం, సీతాముడి, గయ, బుద్ధ గయ తేది:14-11-24. 10 రో టికె 18,000/- (బస్సు రూం+ భోజనం) కె.వాసు, నెల్లూరు. సెల్: **94913 40504**

AJR- 178316

PLOT FOR SALE

కాకినాడ, తులసీనగర్, (నడకుదురు) హైవేకి అతి చేరువలో 2500 చ.గల స్థలం అమ్మకమునకు కలదు. పూర్తి వివరాలకు:- **96401 28519, 96766 83999.**

AJB-403

CHANGE OF NAME

★ I, SREEVALLI DEVI, spouse of KOMMISETTI SATYANARAYANA, resident of Flat No.21/5, B-Block, Madhu Park Ridge Apartments, Beside Tipu Khan Bridge, I.B.Lines Post Office, Hyderabad-500031, have changed my name from SREEVALLI DEVI to KOMMISETTI VALLI DEVI vide Affidavit dated 18.06.2024 at SIRCILLA, Telangana State. AJH-13486

4 Lines CLASSIFIED Rs.230/- Only

సీతానగరంలో 11 డయేరియా కేసులు



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

సీతానగరం, జూలై 4: సీతానగరంలో 11 మంది డయేరియా లక్షణాలతో పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితులను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గురువారం పరామర్శించారు. బాధితులకు అందుతున్న సాయంపై ఆరా తీశారు, రోగులకు మరింత మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలు, ఆహార పదార్థాల శుభ్రత అవసరమన్నారు. గ్రామంలో 11 కేసులు గుర్తించడంతో డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు సీతానగరంలో పర్యటించారు. రోగులను పరామర్శించి స్థానిక పంచాయతీలో ఉన్న వాటర్ ట్యాంక్ నుంచి వస్తున్న కుళాయి వద్ద నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో డయేరియా కేసులున్నాయని, అయితే అవి రికవరీ దిశలో ఉన్నాయన్నారు. అవసరమైన మందులు పీహెచ్‌సీలో ఉన్నాయని, రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. ఇప్పటికే రెండు సార్లు మెడికల్ క్యాంపులు పెట్టారని, డయేరియా అని కాకుండా సస్పెక్టెడ్ కేసులుగా పరిగణించి వైద్య సేవలందించారని, కారణాలను విశ్లేషిస్తున్నామని చెప్పారు.

ప్రసాద విక్రయ కేంద్రాలు ఏర్పాటు

అన్నవరం, జూలై 4: జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం వైపు వెళ్లే భక్తుల కోసం నిర్మించిన సత్యదేవుడి నూతన నమూనాలయం వద్ద ప్రసాదం విక్రయ కేంద్రాలను సిద్ధం చేశారు. ఆషాడమాసంలో తలుపులమ్మ లోవ దర్శించుకుని తిరిగి వెళ్లే భక్తులు అన్నవరం సత్యదేవుడి ప్రసాదాన్ని కొనుగోలు చేసి తమ స్వస్థలాలకు తీసుకెళుతుంటారు. అయితే ఎన్నికలకు ముందు ఆలయాన్ని ప్రారంభించినా పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. లోవ భక్తుల రద్దీ దృష్ట్యా నూతన ప్రసాదం కౌంటర్లు సిద్ధం చేయాలని, ఆషాడమాసం నుంచే విక్రయ కౌంటర్ ప్రారంభించాలని ఈవో ఆదేశించడంతో వెంటనే సిద్ధం చేశారు. ఈనెల 7వ తేదీ మొదటి ఆదివారం కావడంతో 6వ తేదీ నుంచి ప్రారంభించాలని ఆలోచన చేస్తున్నారు. రెండు టిక్కెట్లు కౌంటర్లు, రెండు ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు. అయితే రద్దీని బట్టి రెండో కౌంటర్‌ను వినియోగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కాకినాడలో కల్కి 'బుజ్జి' సందడి



సర్పవరం జంక్షన్, జూలై 4: ప్రముఖ హీరో ప్రభాస్ నటించిన కల్కి సినిమాలో ప్రముఖ పాత్ర వహించిన బుజ్జి కారు కాకినాడలో సందడి చేసింది. సినిమాలో హీరోకు ఉన్న ప్రాధాన్యం బుజ్జి కారుకు లభించింది. సినిమాలో ఈ కారు చేసే విన్యాసాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టున్నాయి. ఈ కారును గురువారం కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో ఎస్ఆర్ఎంటీ మాల్‌లో ఈవెంట్ నిర్వాహకులు అందుబాటులో ఉంచారు. దీనిని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ స్తంభించడంతో ట్రాఫిక్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది క్రమబద్ధీకరించారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ విషయంలో ఘోర తప్పిదాలు

ప్రాజెక్టులో జరిగిన తప్పిదాలు, ఖర్చులు, నష్టాలపై హైకోర్టులో పిల్ వేస్తా

అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, జూలై 4 : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అనేక ఘోర తప్పిదాలు జరిగాయని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో తన చాంబర్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. 2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా పోలవరానికి అంకురార్పణ చేశారని చెప్పారు. అటుపై కిరణ్ కుమార్ రెడ్డి, రోశయ్య, విభజిత ఏపీలో టీడీపీ అధినేత చంద్రబాబు నిర్మాణాలు కొనసాగించారని చెప్పారు. కానీ ప్రభుత్వాలు మారినప్పుడల్లా పోలవరం ప్రాజెక్టు నిర్మాణ సంస్థలు, ఇంజనీర్లు మారిపోయారని చెప్పారు. తొలుత శీనయ్య కమిటీ ఈ ప్రాజెక్టు విషయంలో స్పష్టంగా చెప్పిందని రెండు డయా ఫ్రం వాల్స్ నిర్మించాలని సూచించిందన్నారు. కాని ఒకటే నిర్మించారని చెప్పారు. ఇది ఘోర తప్పిదమన్నారు. ప్రపంచంలో అన్ని ప్రాజెక్టులు రాతి పొరల మీద నిర్మించారు. నాగార్జున సాగర్ డ్యామ్ కూడా రాతి పొర మీదే అయితే పోలవరం నిర్మించేది ఇసుక పొరల మీద అని ఇది చాలా స్ట్రాంగ్‌గా నిర్మించాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో నిర్మాణాలు జరిగితే జగన్ ప్రభుత్వంలో మళ్లీ ఇంజినీర్లు కంపెనీలు మార్చి నిర్మించారన్నారు. 50 లక్షల క్యూసెక్కులు నీరు వచ్చిన తట్టుకునేలా స్పిల్‌వే నిర్మాణం చేశారు కానీ డయా ఫ్రం వాల్ విషయంలో తప్పు చేశారన్నారు. దీని వల్ల వరదల సమయంలో ఏ మాత్రం తేడా వచ్చినా తూర్పుగోదావరి నుంచి కాకినాడ జిల్లా వరకు మొత్తం గల్లంతై పోతాయన్నారు. చాలా శ్రద్ధ తీసుకుని ముందుజాగ్రత్తలు తీసుకుని ప్రాజెక్టు నిర్మాణం చేయాలన్నారు. రెండు డయాఫ్రం వాల్స్ కడితేనే ప్రమాదం ఎదుర్కొనగలమన్నారు. ఒక దానికి ఒకదానికి మధ్య 3 నుంచి 5 మీటర్లు గ్యాప్‌లు ఉండాలని శీనయ్య కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్దేశించిందన్నారు. అయితే ఉమ్మడి రాష్ట్రంలో ఇంజనీరు సీతాపతిరావుతో పాటు చాలా మంది రెండు డయాఫ్రం వాల్స్ అవసరం లేదని ఒకటి చాలు అని చెప్పడం, దీని వల్ల ఖర్చుతగ్గుతుందని చెప్పారని ఇది కరెక్ట్ కాదన్నారు. ఖర్చు తగ్గడం ముఖ్యమా భద్రత ముఖ్యమా అని ప్రశ్నించారు. ఇటీవల సీఎం చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారని కాఫర్ డ్యామ్ నుంచి సీపేజ్ వస్తుందని వాటిని అరికట్టే చర్యలు తీసుకుని ముందుకు సాగాలని, డయా ఫ్రం వాల్ కొట్టుకుపోయింది దానిని నిర్మాణం చేపట్టాలన్నారు. 2018లోనే కాఫర్ డ్యామ్‌తో డేంజర్ అని పత్రికా ముఖంగా తాను చెప్పానన్నారు. ఇప్పుడు విదేశీయుడిని తీసుకువచ్చి సరిగ్గా కట్టలేదంటే కాంట్రాక్టర్ల వైఫల్యమా, ప్రభుత్వాల వైఫల్యమా అని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో ఎల్అండ్‌టీ, నవయుగ, మెగా కంపెనీలను బాధ్యులుగా చేసి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజల సొమ్ము వృథా అయ్యిందని తప్పు ఎవరిదని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టును ప్రభుత్వాలు ఏటీఎంలుగా చేసుకున్నాయి తప్ప భద్రత పట్టించుకోలేదన్నారు. గైడ్ బండ్ కుంగిపోయిన సంఘటనపై కూడా వాళ్లిచ్చిన వివరణ సహేతుకంగా లేదన్నారు. ప్రాజెక్టు విషయంలో జరిగిన తప్పులు, ఖర్చులు నష్టాలపై హైకోర్టులో తాను పిల్ వేస్తానని చెప్పారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి



ఆలమూరు, జూలై 4: మండలంలోని మూలస్థానం గ్రామానికి చెందిన రేలంగి సూర్యనారాయణ (60)ను కారు ఢీకొనడంతో మృతిచెందారు. సూర్యనారాయణ పువ్వుల వ్యాపారం చేస్తుంటారు. గురువారం జొన్నాడ నుంచి ఇంటికి తిరిగి వెళ్తుండగా మూలస్థానం వద్ద రావులపాలెం నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న కారు బలంగా ఢీకొంది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేయగా ఆలమూరు ఎస్ఐ శ్రీనునాయక్ దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరి మహిళపై ఆటోడ్రైవర్ దాడి



స్పృహతప్పి పడిపోయిన మహిళ

రౌతులపూడి, జూలై 4: కాకినాడ జిల్లా రౌతులపూడి సినిమా సెంటర్‌లో ఒంటరి మహిళపై ఆటో డ్రైవర్ దాడి చేశాడు. తీవ్రంగా కొట్టడంతో స్పృహ తప్పిపడిపోయింది. వ్యాపారస్తులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ములగపూడి గ్రామానికి చెందిన కె.లక్ష్మి ఆటోలో రౌతులపూడి వచ్చింది. ఆటోలో నుంచి దిగిన మహిళపై అక్కడే ఉన్న వీరాస్వామి అనే ఆటో డ్రైవర్ ఒక్కసారిగా విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో లక్ష్మి స్పృహ తప్పిపడిపోయింది. తనపై కేసు పెడతావా అంటూ ఆటోడ్రైవర్ దాడి చేశాడని వ్యాపారస్తులు, స్థానికులు తెలిపారు. విషయం తెలిసి లక్ష్మి బంధువులు రావడంతో ఆటో డ్రైవర్ పరారయ్యాడు. బంధువులు లక్ష్మిని తీసుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని జట్టు కూలీ మృతి

అమలాపురం రూరల్, జూలై 4: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఎర్ర వంతెన వద్ద జట్టు కూలీగా పని చేస్తున్న తొత్తరమూడి బులి సత్యనారాయణ (52) పని ముగించుకుని గురువారం రాత్రి సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా భట్నవిల్లి జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని వ్యక్తి ఆత్మహత్య

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 4 : భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కె.గంగవరం మండలం దంగేరు గ్రామానికి చెందిన మెల్లిమి రాజుకు వివాహం జరిగింది. భార్యతో మనస్పర్థలు కారణంగా విడిగా ఉంటున్నాడు. కొత్తూరు గ్రామంలో టిడ్కో గృహంలో నివసిస్తున్నాడు. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో రోజూ మద్యం సేవిస్తున్నాడు. రాజు తల్లి విజయలక్ష్మీ పింఛను నిమిత్తం ఈనెల 1న దంగేరు గ్రామం వెళ్లింది. 2వ తేదీన రాజు తల్లి విజయలక్ష్మీకి ఫోన్ చేసి తన భార్య వచ్చి గొడవపడి వెళ్లినట్లు తెలిపాడు. గురువారం ఉదయం 11 గంటలకు విజయలక్ష్మీ టిడ్కో గృహం వద్దకు వచ్చి చూడగా తలుపులు వేసి ఉంది. కిటికిలో నుంచి చూడగా లోపల నుండి వాసన వస్తుంది. చుట్టుపక్కల వారిసాయంతో తలుపులు తెరచి చూడగా బెడ్‌రూమ్‌లో చీరతో రాజు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెంది ఉన్నాడు. దీంతో విజజయలక్ష్మి ఫిర్యాదుతో ఎస్ఐ కె.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అయినవిల్లి, జూలై 4: మండలంలోని వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన అడపా ప్రేమ్‌కుమార్ (29) గురువారం ఇంట్లో విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే కుటుంబ సభ్యులు అమలాపురం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు వారు తెలిపారు. ఈ ఘటనపై అతని సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజేష్‌కుమార్ తెలిపారు. ప్రేమ్‌కుమార్‌కు భార్య రమాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

ప్రత్తిపాడు, జూలై 4: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం జాతీయ రహదారిపై గురువారం వాహనం ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతిచెందాడు. ధర్మవరం శివారు పెట్రోల్ బంకు సమీపంలో రహదారిపై నడుస్తున్న గుర్తు తెలియని 30 ఏళ్ల యువకుడిని రాజమహేంద్రవరం నుంచి తుని వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్యాంటు, చొక్కా ధరించి ఉన్నాడు. యువకుడు ఆచూకీ తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రికి వెళ్లి వస్తూ..

ప్రైవేటు బస్సు ఢీకొని భార్య మృతి..

భర్తకు తీవ్రగాయాలు



మృతిచెందిన లక్ష్మి

తొండంగి, జూలై 4: ఒంట్లో నలతగా ఉండడంతో ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని బయలుదేరిన ఆమె ఇంటికి చేరకుండానే ప్రమాదానికి గురై మృతిచెందింది. గురువారం కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి శివారు రావికంపాడు సెంటర్ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఎద్దు లక్ష్మి అనే మహిళ మృతి చెందగా ఆమె భర్తకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు అందించిన వివరాల ప్రకారం రావికంపాడు గ్రామానికి చెందిన ఎద్దు లక్ష్మి(53) అనారోగ్యంతో బాధపడుతుండడంతో భర్త జగ్గయ్య ఆమెను మోటార్ సైకిల్‌పై కత్తిపూడి ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు. తిరిగి అన్నవరం వైపు వస్తుండగా వెనుక నుంచి ప్రైవేట్ బస్సు ఢీకొట్టడంతో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త జగ్గయ్యకు తీవ్ర గాయాలు కావడంతో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. తొండంగి ఎస్ఐ వినయ్ ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏజెన్సీ సమాచారం

పోరాట స్ఫూర్తి.. అల్లూరి సీతారామరాజు

ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



అల్లూరికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

రంపచోడవరం, జూలై 4: పోరాట పటిమకు స్ఫూర్తి ప్రదాత అల్లూరి సీతారామరాజు అని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. అల్లూరి 127వ జయంతి సందర్భంగా ఆమె గురువారం స్థానిక ప్రధాన కూడలిలో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువతకు అల్లూరి పోరాట స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్, మండలాధ్యక్షుడు సురేష్‌బాబు, మాజీ అధ్యక్షుడు అడబాల బాపిరాజు, వై.నిరంజనీదేవి, జనసేన నాయకులు పాపోలు శ్రీను, కాకి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో

ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కుంజం వంశీ, తుర్రం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సామాజిక కార్యకర్త, అల్లూరి విగ్రహ దాత డాక్టరు దాస్యం భాస్కరరావు ఆధ్వర్యంలో అల్లూరి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మట్ల కృష్ణారెడ్డి, పాస్టర్ విశాల్, ఎస్ఎస్ఎఫ్ జిల్లా సంయోజక్ గుడ్ల అంక శ్రీనివాసరెడ్డి, గాలింక శేఖర్ పాల్గొన్నారు.

ఐటీడీఏ కార్యాలయంలో

రంపచోడవరం, జూలై 4: ఐటీడీఏ కార్యాలయంలో పీవో సూరజ్ గనోరే అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావు, ఈఈ జి.డేవిడ్‌రాజ్, బి.కిషోర్, చక్రధర్, కె.రాజారెడ్డి, కె.దయానంద్, నాగేంద్ర, సీహెచ్ సోమిరెడ్డి, పి.లక్ష్మిరెడ్డి, ఎంపీహెచ్‌వో పీటర్ పాల్గొన్నారు. సబ్ కలెక్టరు కార్యాలయంలో సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఇన్‌స్పెక్టరు ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, టీడీలు సుబ్బారావు, శివ, శ్రీధర్, సరిత, పాల్‌బాబు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి

రాజవొమ్మంగి జూలై 4: తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో యాదగిరేశ్వరరావు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజవొమ్మంగి పోలీసు స్టేషన్‌లో సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ వెంకయ్య అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేశారు. బోర్నగూడెం ఆశ్రమ పాఠశాలలో అల్లూరి విగ్రహానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు కె.విజయబాబు,ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, వరప్రసాద్, కృష్ణ, ధర్మరాజు, గంగన్న దొర, పాపారావు పాల్గొన్నారు.

మన్యం వీరుడికి ఘన నివాళి

మోతుగూడెం, జూలై 4: చింతూరు మండలం మోతుగూడెం సచివాలయంలో సచివాలయ కార్యదర్శి రవినాయక్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ఆకేటి సీత, ఎంపీటీసీ వీధి నాగేశ్వరరావు నివాళులర్పించారు. డొంకరాయి జిల్లా పరిషత్ హైస్కూల్, సచివాలయాల్లో జయంతి వేడుకలు జరిగాయి. ఎంపీటీసీ కరకా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి

అడ్డతీగల, జూలై4:మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని పురస్కరించుకొని అడ్డతీగలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌లో ఉన్న అల్లూరి విగ్రహం వద్ద స్థానిక టీడీపీ నాయకులు, జనసేన, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అడ్డతీగల ఎస్ఐ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అల్లూరి జిల్లా అల్లూరి సంఘ డివిజన్ అధ్యక్షుడు చోడిశెట్టి ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దంగేటి సత్తిబాబు, బాలయోగి, రాజేంద్ర పాల్గొన్నారు.

ఐటీడీఏ కార్యాలయంలో

చింతూరు, జూలై 4: డివిజన్ కేంద్రమైన చింతూరులో గురువారం అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐటీడీఏ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వరరామచంద్రపురం మండలం, పత్తిపాడుకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు శ్యామల వెంకటరామయ్యకు సన్మానం చేశారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అల్లూరి వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యకుమారి, సీడీపీవో పి.విజయగౌరి తదితరులు పాల్గొన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతల ఆధ్వర్యంలో చింతూరు సెంటర్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. టీడీపీ అధ్యక్షుడు ఇళ్ల చిన్నారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు డీవీఎస్ రమణారెడ్డి, జనసేన నాయకుడు పయ్యాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వై.రామవరంలో..

వై.రామవరం, జూలై 4: బస్ సెంటర్‌లోని అల్లూరి విగ్రహానికి టీడీపీ, జనసేన నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్ రాజు ఆధ్వర్యంలో సిబ్బంది సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బాపన్నదొర, ఎంఈవో తాతబ్బాయిదొర నివాళులర్పించారు.

మాలకొండమ్మ పండుగ

రాజవొమ్మంగి జూలై 4: రాజవొమ్మంగి గ్రామంలో గురువారం మాలకొండమ్మ పండుగను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. గ్రామస్థులు గ్రామ పొలిమేర వరకు వెళ్లి మాలకొండమ్మకు నైవేద్యం సమర్పించారు. ప్రతిఏటా ఈ పండుగ చేస్తే వర్షాలు పడతాయని, పంటలు బాగా పండి రైతులకు లాభం చేకూరుతుందని భక్తుల నమ్మకం.

సబ్సిడీపై విద్యుత్ మోటార్లు

వరరామచంద్రాపురం, జూలై 4: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన జలగం వెంగళరావు, బెంగమాంబ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జలగం ప్రసాద్‌రావు గురువారం పేద రైతులకు సబ్సిడీపై విద్యుత్ మోటార్లు అందించారు. జలగం వెంగళరావు కుమారుడు మాజీ మంత్రి జలగం ప్రసాద్‌రావు వీఆర్ పురం మండలానికి వచ్చారు. రేఖపల్లిలోని మామిడి రాజు నివాసంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయం చేసుకుంటూ విద్యుత్ మోటారు కొనుక్కునే స్తోమత లేని రైతులందరికీ కావల్సిన విద్యుత్ మోటార్లు 50 శాతం రాయితీపై ఇస్తామన్నారు. పెద్దమట్టపల్లి తదితర గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. సుమారుగా 40 మంది రైతులు విద్యుత్ మోటార్ల కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ముత్యాల రామారావు, రెడ్డిమళ్ళ శ్రీను, కర్నాటి ఏసు, తలగాని వెంకన్నబాబు, కడుపు రమేష్, మాదిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

దొడ్డి కొమరయ్య వర్ధంతి

రంపచోడవరం, జూలై 4: స్థానిక మార్క్స్ ఏంగిల్స్ భవనంలో ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యుడు పల్లాల లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య 18వ వర్ధంతి నిర్వహించారు. ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి కె.దూలయ్య మాట్లాడుతూ పేద మధ్య తరగతి ప్రజల నుంచి భూస్వాములు ఆక్రమించిన భూములపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనపర్తి, జూలై 4: పలు సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. అనపర్తి పరిధిలో జీబీఆర్ కాలేజీ ఏరియా, ఇందిరా నగర్, సునందపేట, మార్కెండేయపురం, మార్కెట్ శేషగిరిరావు పేట, వెంకటరత్నపురం, కొప్పవరం, మహేంద్రవాడ, లక్ష్మీనరసాపురం గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి 1గంట వరకు, అనపోతవరం పరిధిలోని ధరణికోట, పాతవూరు, బాపనమ్మ గుడి, సావరం కాలనీ, మహాలక్ష్మిపేట, సీడీఆర్ హాస్పిటల్ ఏరియాల్లో మధ్యాహ్నం 2నుంచి 6గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.



అల్లూరికి నివాళులర్పిస్తున్న నన్నయ రిజిస్ట్రార్ సుధాకర్



ధవళేశ్వరంలో అల్లూరికి నివాళులర్పిస్తున్న దృశ్యం



బిక్కవోలులో..

దేశభక్తిని పెంపొందించుకోవాలి

- ఆదికవి నన్నయ వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్
- ఘనంగా సీతారామరాజు జయంతి వేడుకలు
- మన్యం వీరుడికి నాయకులు, అధికారుల నివాళి

దివాన్‌చెరువు, జూలై 4: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, విద్యార్థులంతా దేశ భక్తిని పెంపొందించుకుని సమాజ హితం కోసం జీవించాలన్నారు. ఆదికవి నన్నయ వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని పలు చోట్ల గురువారం ఘనంగా నిర్వహించారు. నన్నయ వర్శిటీలో అల్లూరి చిత్రపటానికి రిజిస్ట్రార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారత స్వాతంత్రోద్యమంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సీతారామరాజు చేసిన సాయుధ పోరాటం గొప్పదని, తెలుగువారి పౌరుషానికి, దేశ భక్తికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో వర్శిటీ అధికారులు పి.సురేష్ వర్మ, కె.శ్రీరమేష్, వై.శ్రీనివాసరావు, డి.జ్యోతిర్మయి. వి.పెర్సిస్, పి.వెంకటేశ్వరరావు, ఎస్.లింగారెడ్డి, జ్యోతి, చంద్రకళ, విజయకుమారి, కార్యక్రమం కోఆర్డినేటర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: స్థానిక మసీదు వీధిలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి మాజీ ఉపసర్పంచ్ మెండా సత్తులు, వేగిశెట్టి కోదండరామారావు, వైసీపీ నాయకుడు సాధనాల శివ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీరంగం బాలరాజు, మెండా రాజేష్, ఒంటెద్దు స్వామి, ముత్యాల పోసికుమార్, అడపా హరీష్ పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలు ఉన్నత పాఠశాలలో అల్లూరి చిత్రపటానికి ఇన్‌చార్జి హెచ్ఎం రామలక్ష్మి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అల్లూరి బ్రిటీష వారితో జరిపిన పోరాటాలను విద్యార్థులకు వివరించారు.

కడియం: కడియంలో అల్లూరి విగ్రహానికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పూలమాలలతో నివాళులర్పించారు. అల్లూరి సీతారామరాజు మన తెలుగువారు కావడం తెలుగుజాతికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వెలుగుబంటి ప్రసాద్, పంతం గణపతి, ప్రత్తిపాటి రామారావుచౌదరి, వెలుగుబంటి నాని, గట్టి నర్సయ్య, ముద్రగడ జమీ, చెల్లుబోయిన శ్రీను, పాటంశెట్టి రాంజీ, పాల్గొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన అల్లూరి జయంతి కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో అల్లూరి జయంతి సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు హెచ్ఎం టి.సత్యనారాయణ, గొల్లపల్లి సత్యనారాయణ బహుమతులు అందజేశారు.

రాజమహేంద్రవరం కల్చరల్: ఎస్‌కేవీటీ కళాశాలలో గురువారం అల్లూరి 125వ జయంతిని కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజబాబు, పీవీబీ సంజీవరావు, కె.నీలకంఠేశ్వరరావు, పి.బాబూరావు, టీసీవై రత్నం, లలిత రమ్య,కె.శారద, పల్లి సుధ, ఎస్.దుర్గ పాల్గొన్నారు.

అనపర్తి: మండలంలోని లక్ష్మీనరసాపురంలో అల్లూరి విగ్రహానికి కూటమి నాయకులు కార్యకర్తలు నివాళులర్పించారు. టీడీపీ జిల్లా వాణిజ్య విభాగాధ్యక్షుడు తమలంపూడి సుధాకరరెడ్డి, తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరిలోని పోరాట పటిమను ప్రతి పౌరుడు అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి శివరామకృష్ణంరాజు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

కోరుకొండ: కోరుకొండ అల్లూరి సీతారామరాజు సెంటర్ వద్ద అల్లూరి విగ్రహానికి సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, వార్డుమెంబర్ కర్రి వీరగణేష్ పూలమాలలతో నివాళులర్పించారు. సీతారామరాజు అడుగు జాడల్లో నడవడమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుంకర శ్రీనివాస్, దాశెట్టి శ్రీనివాస్, బోకర కొండ శ్రీను, జనసేన నాయకులు కోసూరి ప్రసాద్, కోసూరి శ్రీను, బీజేపీ నాయకులు పచ్చారి నరసింహమూర్తి, గూడ్స్ ఆటోయూనియన్, పాసింజర్‌ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సీతారామరాజు చిత్రపటానికి ఎంపీడీవో హేమసుందర్రావు, ఎంఈవో కుశలవదొర పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, ఎంపీడీవో కార్యాలయ, మండల విద్యావనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



అనపర్తిలో అల్లూరికి నివాళులర్పిస్తున్న దృశ్యం



కోరుకొండలో..



రాజమహేంద్రవరంలో..

ఘనంగా రంగా జయంతి

- నివాళులర్పించిన పలువురు నాయకులు

కడియం: కడియంలో సాయిబాబా ఆలయం సమీపంలోని రంగా విగ్రహానికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో వెలుగుబంటి ప్రసాద్, పంతం గణపతి, చెక్కపల్లి మురళి, చెల్లుబోయిన శ్రీను, వాశంశెట్టి నాగబాబు, అప్పారి అన్నవరం పాల్గొన్నారు. రంగా యూత్ చిలుకూరి ప్రభాకర్ దళితవాడ పాఠశాల, బీసీ హాస్టల్ విద్యార్థులకు గొడుగులు, విద్యాసామగ్రి అందజేశారు. దొడ్డా సోదరులు స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు.

దివాన్‌చెరువు: పాలచర్లలో రంగా విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌ను కట్ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల నియమితులైన గంగిశెట్టి చంటిబాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: స్థానిక రాధారంగ మిత్ర మండలి ఆధ్వర్యంలో బాలికోన్నత పాఠశాల వద్ద రంగా విగ్రహానికి కాపు నాయకులు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మెండా సత్తులు, తోరాటి ప్రభాకరరావు, అడపా శ్రీను, సాధనాల చంద్రశేఖర్, మద్దాల అను, నారపురెడ్డి మురళి, ఎడ్ల వెంకటేష్, ముత్యాల పోసికుమార్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: రంగా మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్డి మురళీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో రంగా జయంతి కార్యక్రమం జరిగింది. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు, పిన్నింటి రవిశంకర్, కొండా తదితరులు హాజరయ్యారు. రంగా చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు.

కోరుకొండ: మండలంలోని కాపవరంలో రంగా జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. రంగా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దివాన్‌చెరువు:పాలచర్లలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



ధవళేశ్వరంలో రంగా విగ్రహం వద్ద నాయకుల నివాళి



రాజమహేంద్రవరంలో రంగాకు నాయకుల నివాళి

సింపతీ కోసం భరత్ చీఫ్ పాలిటిక్స్

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 4: ఓటమి పాలైన వైసీపీ అభ్యర్థి,మాజీ ఎంపీ భరత్ రామ్ ప్రజల్లోకి రావడానికి సింపతీకోసం చీఫ్ పాలిటిక్స్ ప్లే చేశాడని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. గురువారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తన ప్రచార రథాన్ని కావాలనే కొంత మంది దహనం చేశారని టీడీపీ వాళ్లపై నెట్టే ప్రయత్నం చేసి ప్రజల్లో సింపతీ పొందాలని చూసిన భరత్ రామ్ నైజం బయట పడిందన్నారు. పోలీసులు విచారణలో వాస్తవాలు బయటకు వచ్చాయని చెప్పారు.

రాజమహేంద్రవరాన్ని నాశనం చేసింది భరతే

టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాస్యం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 4: రాజమహేంద్రవరాన్ని నాశనం చేసింది మాజీ ఎంపీ భరత్ రామ్ అని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్ ధ్వజమెత్తారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భరత్ రామ్ ఇంకా తానే రాజమహేంద్రవరం ఎంపీగా ఉన్నాననే భ్రమలో ఉన్నాడన్నారు. అతన్ని నగరంలో 72 వేల మంది ప్రజలు ఛీత్కరించారని అయినా అతనికి బుద్ధిరాలేదన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అధికారమదంతో ఎన్ని దారుణాలు చేశారో ప్రజలందరికి తెలుసునన్నారు. సంస్కృతికి సంప్రదాయాలకు గౌరవం ఇచ్చే పార్టీ టీడీపీ అని దానికి నిదర్శనమే మోరంపూడి ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి స్తంభానికి వైసీపీ టీడీపీ ప్రభుత్వాల హయాంలో వేసిన శిలాఫలకాలు రెండు ఒకే చోట ఏర్పాటు చేయడమేనన్నారు. భయపడి దాక్కున్న పాలిక శ్రీను, చిట్టూరి ప్రవీణ్‌లు బయటకు రావాలన్నారు. సమావేశంలో టీడీపీ ఎస్సీ సెల్ నగర ఉపాధ్యక్షుడు బూరా రమణ, మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి బషీర్, 48వ డివిజన్ ఇన్‌చార్జి కానేటి ప్రభుదాస్, సలాది ఆనంద్, జనసేన నాయకులు లోవ రాజు, అరుణ్ కుమార్ , అఖిల్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు వైద్యులతో సమీక్ష

కోరుకొండ, జూలై 4: జిల్లా అదనపు వైద్యాధికారిణి జిల్లా కుష్ఠు, క్షయ, ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ వసుంధర సీజనల్ వ్యాధుల నివారణకు కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. గురువారం ఆమె ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సీజనల్‌వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో మంచినీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించిక్లోరినేషన్ చేయించాలన్నారు.డయేరియా, ఫీవర్‌కేసులు సకాలంలో గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాన్నారు.ఈ నెల 18 నుంచి ఆగస్టు2నవరకు జరిగే లెప్రసీకేసుల సర్వే కార్యక్రమం విజయం చేయాలన్నారు.అనుమానిత చర్మవ్యాధులు, లెప్రసీ, ఎయిడ్స్‌కేసులను ప్రత్యేకశ్రద్దతో చూడాలన్నారు.హాస్టల్ విద్యార్థులకుఅందుతున్నసేవలు గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్‌ప్రజ్ఞ, డాక్టర్‌జ్ఞానచంద్ర, డాక్టర్ సునీల్, హెల్త్‌సూపర్ వైజర్ భారతి,లక్ష్మీకాంతం సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా సాధించాలి

జై హింద్ పార్టీ వ్యవస్థాపకుడు ధశరథరామిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 4: స్వాతంత్ర్య సమరయోధుడు ,మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలోని హామీలను నెరవేర్చేందుకు కృషి చేయాలని ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి జై హింద్ పార్టీ వ్యవస్థాపకుడు ఎన్.ధశరథరామిరెడ్డి, ప్రత్యేక హోదా జేఏసీ కన్వీనర్ మర్రి రాజా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేసారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇచ్చేవరకు జాతీయ రహదారుల సంస్థకు చెల్లించే టోల్ ట్యాక్స్ కట్టవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు.

పదోన్నతి పొందిన ప్రిన్సిపాల్‌కు సత్కారం

రంగంపేట, జూలై 4: రంగంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొంది బదిలీపై జగ్గంపేట జూనియర్ కళాశాలకు వెళుతున్న వేమగిరి శ్రీనివాసరావును గురువారం కళాశాల సిబ్బంది సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలకు చేసిన సేవలను పలువురు అధ్యాపకులు కొనియాడారు. అలాగే ఇదే కళాశాలలో బోటనీ అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తూ ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందిన బి.హేమను అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎన్.పద్మావతి, అధ్యాపకులు మాధురి, కృష్ణమూర్తి, రమణ, శేఖర్‌బాబు, శ్యామలరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెద రాయవరంలో రైసు మిల్లులపై దాడులు

23 టన్నుల పీడీఎస్ బియ్యం స్వాధీనం



పెదరాయవరంలో స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యంతో సివిల్ సప్లై అధికారులు

అనపర్తి, జూలై 4: రంగంపేట మండలం పెదరాయవరంలోని శ్రీరామకృష్ణ రైస్ మిల్లులో గురువారం సివిల్ సప్లై అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్లులో నిల్వ ఉంచిన పీడీఎస్ రైస్‌ను గుర్తించిన అధికారులు రైస్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్ఎస్‌వో ఎం.నాగాంజనేయులు మాట్లాడుతూ మిల్లులో అక్రమంగా ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ ఉంచిన 23టన్నుల 330కేజీల రైస్‌ను గుర్తించామన్నారు. ఈ రైస్‌ను సీజ్‌చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. బియ్యాన్ని గోపాలపురంలోని ఎమ్ఎల్ఎస్ స్టాక్ పాయింట్‌కు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. దాడుల్లో సివిల్ సప్లై డీటీ బాపిరాజు, కె సూర్యప్రభాకర్, ఈఆర్‌వో వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

28న ఎస్పీ బాలు స్మారక మధుర గీతాలాపన

రాజమహేంద్రవరం కల్చరల్/ధవళేశ్వరం, జూలై 4: రాజమహేంద్రవరం రాకా సాంస్కృతిక సంస్థ, గోదావరి కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని వారి వారి స్వగృహాల్లో ఘనంగా సత్కరించారు. ఈ నెల 28న స్థానిక విక్రమహాల్లో తాము సంయుక్తంగా నిర్వహించే ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మారక మధుర గీతాల కార్యక్రమానికి వారిద్దరినీ ఆహ్వానించగా అంగీకరించనట్టు తెలిపారు. సాంస్కృతికంగా ఎంతో వైవిధ్యం కలిగిన మన ప్రాంతానికి మన కళాకారులు పేరు ప్రఖ్యాతులు తెచ్చి, సాంస్కృతిక సాహిత్యపరంగా మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాకా ప్రధాన కార్యదర్శి జీవీ రమణ, ఎర్రమోతు ధర్మరాజు, గోదావరి కల్చరల్ అసోసియేషన్ తిరుమల కృష్ణమోహన్, జగన్నాథం, సూరపరెడ్డి తాతారావు, నాగభూషణం, రమేష్, శేష్‌కుమార్ పాల్గొన్నారు.

పశువుల పెంపకంతో రైతులకు మేలు

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి



కడియం పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, జూలై 4: రైతులు ఆదాయం పెంచుకునేందుకు వ్యవసాయంతో పాటు పశువుల పెంపకం చేసుకోవాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. గురువారం కడియం పశువైద్యశాలలో నిర్వహించిన పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పశుసంపదను కాపాడుకోవడంతో పాటు మెరుగైన డెయిరీ సంపద పెంచుకోవాలన్నారు. పశువైద్యులు పశువుల్లో గర్భవిచ్చితి కాకుండా వైద్యం అందించి పాడిరైతులకు సహాయం అందించాలన్నారు.అనంతరం పశువుల మందులను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మెసిగంటి సత్యవతి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, పంతం గణపతి, వెలుగుబంటి నాని, చెల్లుబోయిన శ్రీను, ప్రత్తిపాటి రామారావుచౌదరి, గట్టి సుబ్బారావు, చిట్టూరి అమ్మిరాజు పాల్గొన్నారు.

నర్సరీ రంగం టూరిజంగా అభివృద్ధి!

టూరిజం రీజనల్ డైరెక్టర్ స్వామినాయుడు

కడియం, జూలై 4: నర్సరీ రంగాన్ని టూరిజంగా అభివృద్ధి చేసేందుకు మొదటి దశగా నర్సరీల్లో ఇంటర్నల్ కనెక్టివిటీ పాత్‌లను ఏర్పాటు చేయాలని డిప్యూటీ కలెక్టర్, టూరిజం రీజనల్ డైరెక్టర్ వి.స్వామినాయుడు తెలిపారు. గురువారం కడియపులంక నర్సరీ అసోసియేషన్ హాలులో ఆయనతోపాటు డీటీవో వెంకటాచలం, ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ దుర్గేష్, కడియం ఉద్యానశాఖ అధికారి డి.సుధీర్‌కుమార్ నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు, నర్సరీ పాలకవర్గంతో భేటీ అయ్యారు. నర్సరీల్లో ఇంటర్నల్ కనెక్టివిటీ పాత్‌లు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక ప్రదేశాల్లో ట్రీహట్స్ ఏర్పాటుతో పాటు పలు అంశాలను చర్చించారు. కార్యక్రమంలో పెనుమాక కొండబాబు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

లారీ డ్రైవరుకు ఏడాది జైలు

కడియం, జూలై 4: మోటారుసైకిల్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. ఈ కేసులో లారీ డ్రైవరుకు ఏడాది జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 7వ ఏజేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ పి.బాబు తీర్పునిచ్చారు. సీఐ తులసీధర్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. 2019 నవంబర్ 19న వేమగిరికి చెందిన వై.నవీన్‌కుమార్, టి.కృపానందం మోటారుసైకిల్‌పై వేమగిరి నుంచి ధవళేశ్వరం వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో వారిద్దరూ గాయలపాలయ్యారు. దీనిపై అప్పటి ఎస్ఐ అమీనాబేగం కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం ధవళేశ్వరం ఎర్రకొండకు చెందిన లారీడ్రైవర్ బోడల రమేష్‌కిరణ్‌కు ఏడాది జైలు శిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. ఈ కేసును ఏపీపీ ఓ.మహాలక్ష్మి వాదించారు. కోర్టు కానిస్టేబుల్ ఎల్.గంగాధర్‌ను సీఐ అభినందించారు.

7న జిల్లా చదరంగం పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 4: గాంధీపురం శ్రీ గౌతమి స్మార్ట్ స్కూల్లో బాల బాలికలకు ఆదివారం అండర్ 17, 19, బాల బాలికలకు చదరంగం పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లా చదరంగ సంఘం కార్యదర్శి జి.వి.కుమార్ తెలిపారు. అండర్ 19 విభాగంలో గెలుపొందిన నలుగురు 18,19 తేదీల్లో నంద్యాలలో జరిగే రాష్ట్ర పోటీలకు, అండర్ 17 విభాగంలో మొదటి ఇద్దరు విజేతలు విజయనగరంలో జరిగే రాష్ట్ర పోటీలకు తూర్పుగోదావరి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు, తమ పేర్లను www.apchess.org వెబ్‌సైట్ ద్వారా నమోదు చేయించుకోవాలని కార్యదర్శి కోరారు. వివరాలకు సెల్ 98483 74133ని సంప్రదించాలని కోరారు.

ఘనంగా రోశయ్య జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 4: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 91వ జయంతిని వైఎంవీఏ హాలులో యంగ్‌మెన్స్ వైశ్య అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ మద్దుల మురళీకృష్ణ, పలువురు ప్రముఖులు రోశయ్య చిత్రపటానికి వేసి నివాళులర్పించారు. వృద్ధులకు పింఛన్లు, కిరాణా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎంవీఏ మాజీ అధ్యక్షుడు యిన్నమూరి రాంబాబు, పందిరి వీరభద్రస్వామి, వైశ్య హాస్టలు అధ్యక్షుడు కోట్ల కనకేశ్వరరావు, కోదూరి శేషగిరిరావు, నాళం విశ్వకల్యాణ్, సత్యవరపు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే మేలైన దిగుబడులు

రాజానగరం వ్యసాయాధికారి ఇమామి ఖాసిం

రాజానగరం, జూలై 4: వరిసాగులో రైతులు మెలకువలు పాటిస్తే మేలైన దిగుబడులు సాధించవచ్చని రాజానగరం మండల వ్యసాయాధికారి షేక్ ఇమామి ఖాసిం పేర్కొన్నారు. మండలంలో వరి నాట్లు వేయడం ప్రారంభమైందని, రైతులు ప్రధానంగా ఆర్‌పీ బయో-226, ఎంటీయూ-7029; ఎంటీయూ-1318, పీఎల్‌ఏ-1100, ఎంటీయూ-1061 రకాలు సాగుచేస్తున్నారన్నారు. సుమారు 4282 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగవుతోందని, రైతులకు కావాల్సిన నాణ్యమైన విత్తనాలను రైతుసేవ కేంద్రాల ద్వారా అందించామన్నారు. ఎరువులు, విత్తనాలను సొసైటీల ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. పచ్చిరొట్ట విత్తనాలను 50శాతం రాయితీపై రైతు సేవ కేంద్రాల ద్వారా అందించామన్నారు. మండలంలో నిర్దేశించిన 1172 మట్టి నమూనాలను పూర్తిగా రైతుల పొలాల నుంచి సేకరించామని, పరీక్షలు పూర్తి చేసి త్వరలోనే ఫలితాలు వెల్లడిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన మార్గదర్శకాల ప్రకారం తాజాగా సాగు హక్కు పత్రాలు జారీ చేస్తున్నామన్నారు. రైతులు వారి వివరాలను గ్రామ స్థాయిలో రైతుసేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేస్తే, వీఆర్వో నుంచి సాగు హక్కు పత్రాలను జారీ చేస్తారన్నారు. మండలంలో ఎప్పటికప్పుడు పురుగుల మందులు ఎరువులు, విత్తనాలు దుకాణాలను తనిఖీ చేస్తున్నాం. రైతులు తప్పని సరిగా బిల్లులు తీసుకోవాలి. ఏదైనా ఇబ్బంది వస్తే తక్షమే వ్యవసాయాధికారి దృష్టికి తీసుకురావాలని కోరారు.

దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీ పందిరి మహాదేవుడు కోటిలింగాల సత్రం, కోటిలింగాలపేట, రాజమహేంద్రవరం
టెండరు-కమ్-ఇ ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
ఆర్.సి.నెం:బి2/37/2023 ది.04.07.2024
ఈ సత్రమునకు అవసరమైన కూరగాయలు కొరకు టెండర్లు ది.01.08.2024 నుండి ది.31.07.2025 వరకు సప్లై చేయుటకు ఇ-టెండర్-కమ్-సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షెడ్యూల్ రూ.200/-కార్యాలయం నందు పొందవలెను. పూర్తి చేసిన కూరగాయల యొక్క సీల్డు టెండర్లు ది.12.07.2024 ఉ.10.00 గం.లోపు కార్యాలయములోగల టెండరు బాక్సునందు వేయవలెను. అదే రోజు ది.12.07.2024 ఉదయం 10.30 గంటలకు అధికారుల సమక్షంలో తక్కువ రేట్లతో టెండరు వేసిన వారితో నెగోషియేషన్ చేయబడును. ఇ-టెండర్లు వేయువారు https://tender.apeprocurement.gov.in నందు దాఖలు చేయవచ్చును. ధరావత్తుల మరియు ఇతర వివరములకు స్వయంగా గానీ ఫోన్: email:endow-eopmk@gov.in ద్వారా సంప్రదించవచ్చును.
ఫోన్: 0883-2476959, 9491000718
వి.వి.పళ్లంరాజు, బి.టెక్
సహాయ కమీషనరు & కార్యనిర్వహణాధికారి


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శుక్రవారం 5 జూలై 2024 | 5





పవన్ అందరికీ చెప్పలేరు కదా?

రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు, బాలికల ఆచూకీ తెలియకుండా పోయిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎప్పటి నుంచో నెత్తీ నోరు బాదుకుంటూనే ఉన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పరిస్థితి మరీ దుర్లభంగా మారిపోయిందని ఆవేదన చెందుతూనే ఉన్నారు. అయినా జగన్ జమానాలో పట్టించుకున్న దాఖలాలు లేవు. గణాం కాలను పరిశీలిస్తే ఆయన ఎందుకు అంత బాధ పడు తున్నారో అర్థమవుతుంది. 9 నెలల కిందట అదృశ్యమైన ఓ యువతి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఎక్కడో జమ్మూలో ఉన్న అమ్మాయిని చిన్న క్లూతో పోలీసులు 48 గంటల్లో గుర్తించారు. మరి మిగతా కేసుల్లో ఎందుకు తాత్సారం జరుగుతోంది? దర్యాప్తులో వేగం ఎందుకు ఉండడం లేదు? అదృశ్యం కేసులను ఎందుకు చులకనగా చూస్తున్నారు? అనేవి ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి.వ్యవస్థలు ఎన్ని ఉన్నా ఆడపిల్ల తల్లిదండ్రులకు అవస్థలు తప్పడం లేదనేది బహిరంగ వాస్తవం.

2016 నుంచీ 560 మంది..

అదృశ్యం కేసుల్లో గణాంకాలను పరిశీలిస్తే ఒళ్లు గగుర్పాటుకు గురౌతుంది. 2016 నుంచీ ఉమ్మడి, విభజిత తూర్పుగోదావరిలో నేటి వరకూ బాలలు 21, బాలికలు 70, పురుషులు 249, మహిళలు 220 మొత్తంగా 560 మంది ఆచూకీ దొరకలేదు. గడిచిన ఐదేళ్లలో 18 మంది బాలికలు, 178 మంది యువతులు ఏమైపోయారో ఇప్పటికీ తెలియలేదని పోలీసు గణాంకాలు చెబుతు న్నాయి. ఆచూకీ దొరకని వారిలో మైనర్లు ఉండడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది. 2016లోని కేసు కూడా ఇంకా పరిష్కారం కాలేదు.

రాజమండ్రి త్రీటౌన్ ప్రథమం..

ఏకంగా 89 అదృశ్యం కేసుల పెండింగ్‌తో రాజమండ్రి 3 టౌన్ పోలీస్ స్టేషన్ మొదటి స్థానంలో ఉంది. తర్వాత రాజానగరం, బొమ్మూరు ఉన్నాయి. సిటీ పరిధిలో ఉన్న రాజమండ్రి 1టౌన్,2టౌన్, 3టౌన్, ప్రకాశంనగర్, బొమ్మూరు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో 198 మంది ఆచూకీ నేటికీ దొరకలేదు. అయితే ఆన్‌లైన్‌లో, రికార్డులు అప్‌డేట్ చేయనివి 560 కేసుల్లో కొన్ని ఉంటాయని పోలీసులు చెబుతున్నారు. 70 మంది బాలికల అదృశ్యం కేసులు జాబితాలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది.



మళ్లీ ఎన్నికలు

- 20న ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ ఎన్నికలు
- నోటిఫికేషన్ జారీ చేసిన అధికారులు
- 11వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ
- చివరిగా 2013లో ఎన్నికలు
- చైర్మన్ రేసులో చల్లా శంకరరావు
- వైసీపీ పోటీలో ఉంటుందా?

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిష్ఠాత్మకమైన ఆర్యాపురంఅర్బన్ బ్యాంక్ ఎన్నికల సందడి మొదలైంది..తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి ప్యానల్ కూడా సిద్ధమైంది. రేపోమాపో వారి పేర్లను ప్రకటించనున్నారు. మొత్తం 12 మంది డైరెక్టర్ల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి.అందులో రెండేసి సీట్లు తమకు ఇవ్వాలని జనసేన, బీజేపీ వర్గాలు పట్టుబడుతున్నాయి. కానీ టీడీపీ చెరొకటి ఇస్తామని చెబుతు న్నట్టు సమాచారం. దీనిపై రేపో మాపో స్పష్టత రానుంది. చైర్మన్ పదవి రేసులో అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ చల్లా శంకరరావు రేసులో ఉన్నారు.ఇక ప్రతిపక్ష వైసీపీ ఓటమి భారంతో బాధపడుతోంది. సొంతంగా ప్యానల్ కట్టే పరిస్థితి కనిపించడంలేదు. ఇటీవల కొందరు దీనిపై చర్చించుకున్నారు. మాజీ ఎంపీ మార్గాని భరత్, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను కొందరు కలిసి పోటీపై చర్చించి నట్టు సమాచారం.కానీ ఇంకా స్పష్టత లేదు. మరొక పక్క వామపక్షాలు, ఇతర పార్టీలు పాలకవర్గ ఎన్నిక ఏకగ్రీవం కావాలని పట్టుబడుతున్నారు. టీడీపీ కూటమి మాత్రం ఎన్నికలకైనా సిద్ధమవుతోంది. ఎన్నికలు జరుగుతాయా, పాలకవర్గం ఏకగ్రీవం అవుతుందా అనేది తేలనుంది. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ఈ ఎన్నికల కోసం వివిధ వర్గాలతో మంతనాలు జరుపుతున్నారు. కూటమి నేతలుగా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, జనసేన సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ జోక్యంతో కూటమి అభ్యర్థుల ఎంపిక ఖరారయ్యే అవకాశం ఉంది.

11న నామినేషన్ల స్వీకరణ.. 20న పోలింగ్

అర్బన్ బ్యాంక్‌కు గురువారం ఎన్నికల అధికారి వి. కృష్ణకాంత్ నోటిఫికేషన్ జారీ చేశారు. చివరగా 2013లో ఎన్నికల జరిగాయి. 2018లో తిరిగి జరగాలి. అప్పటి నుంచి వాయిదా పడింది. ప్రస్తుతం ఎన్నికలకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 11 నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు.11వ తేదీ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. అదే రోజున ఎన్నికల అధికారి దాఖలైన నామినేషన్ల వివరాలు ప్రకటిస్తారు. 12వ తేదీ ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్క్రూట్నీ ఉంటుంది. తుది జాబితా ప్రకటిస్తారు.20వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. 22న కొత్తపాలకవర్గం సమావేశమైన కొత్త చైర్మన్‌ను ఎన్నుకుంటారు. రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ సుమారు రూ.1080 కోట్ల టర్నోవర్‌తో మొత్తం 16 బ్రాంచిలు ఉన్నాయి. రాజమహేంద్రవరం మెయిన్ బ్రాంచి,కాతేరు, తిలక్‌రోడ్‌లోని స్వరాజ్‌నగర్, కోటగుమ్మం, బొమ్మూరు, దానవాయిపేట, దివాన్‌చెరువు, జెఎన్‌రోడ్డుతో 9 బ్రాంచిలు రాజమహేంద్రవరంలోనే ఉన్నాయి.గుంటూరు, తాడేపల్లిగూడెం, భీమవరం,విశాఖ,తణుకు,అమలాపురం,కాకినాడలలో ఒక్కో బ్రాంచి ఉన్నాయి. 78423 మంది ఓటర్లు ఉన్నారు.రహస్య బ్యాలెట్ పద్ధతిలో మొత్తం 12 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ఎన్నికైన 12 మంది డైరెక్టర్లు కలసి చైర్మన్‌ను ఎన్నుకుంటారు. మొత్తం ఆర్యాపురం బ్యాంక్ పరిధిని మూడు నియోజకవర్గాలుగా విభజించారు.1వ నియోజకవర్గం రాజమహేంద్రవరం బ్రాంచిల పరిధి లోని ఓటర్లు 10మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు.ఎక్కువ ఓటర్లు ఇక్కడే ఉంటారు.కాకినాడ, తాడేపల్లిగూ డెం,తణుకు బ్రాంచిలకు ఒక డైరెక్టర్,దివాన్‌చెరువు, భీమవరం, అమలాపురం,వైజాగ్ (సీతమ్మధార), గుంటూరు బ్రాంచిలకు ఒక డైరెక్టరును ఎన్నుకుంటారు.

ఏమైపోతున్నారు.. వీళ్లు!



పెరుగుతున్న అదృశ్యం కేసులు

- 8 ఏళ్లలో 560 మంది జాడలేరు
- వీరిలో 220 మంది మహిళలు
- సెల్‌ఫోన్, స్నేహితుల ప్రభావం
- అదృశ్యం కేసులపై తీవ్ర జాప్యం
- 2016లో కేసూ ఇంకా తేలలేదు
- అదృశ్య కేసులపై ప్రత్యేక బృందం
- పవన్ కల్యాణ్ ప్రకటన
- తల్లిదండ్రుల్లో చిగురిస్తున్న ఆశలు

అదృశ్యం అవుతున్న వారంతా ఏమైపోతున్నారు? వ్యభిచార కూపాల్లో చిక్కుకున్నారా?.. వెట్టిచాకిరీలో మగ్గుతున్నారా?.. బాల కార్మికులుగా నలిగిపోతున్నారా?.. ఎవరి కబంధ హస్తాల్లో అయినా చిక్కుకుపోయారా?.. ఇప్పటికే దేశం దాటించేశారా?.. ఇంటికి రావడానికి ముఖం చెల్లక అల్లాడిపోతున్నారా?.. ఎవరైనా నమ్మించి 'అవసరం' తీర్చుకొని నడి రోడ్డుపై వదిలేస్తే జీవచ్ఛవాల్లా మిగిలిపోయారా? అసలు ఊపిరితో ఉన్నారా?.. ఇలాంటి ప్రశ్నలు బాధిత తల్లిదండ్రులకు ప్రతిక్షణం నరకం చూపిస్తున్నాయి. ఎక్కడ ఉన్నా తమ పిల్లలు క్షేమంగా ఉన్నారనే సమాచారం ఏదో నిమిషంలో అందుతుందనే నమ్మకంతో పోలీసు శాఖ కబురు కోసం ఎదురు చూస్తున్న పండుటాకులు ఎన్నో ఉన్నాయి. వివాహితలు ఇల్లు విడిచి వెళ్లిన సందర్భాల్లో తల్లి కోసం పిల్లలు అల్లాడిపోతున్న ఘటనలు హృదయాన్ని ద్రవింపజేస్తున్నాయి. జిల్లాలో ఒక్కటా రెండా 2016 నుంచి చూస్తే 560 మంది అదృశ్యమైపోయారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బాలికలు, మహిళల అదృశ్యం కేసులు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి.. రక్షణగా ఉండాల్సిన వ్యవస్థలు అందరినీ ఒకే గాటన కట్టేసి దర్యాప్తుల్లో జాప్యం చేయడం వల్ల చాలా మంది ఏ కూపంలో కూరుకుపోయారో ఇప్పటికీ సమాధానం లేని ప్రశ్నగానే మిగిలిపోయింది. ఆడవారికి రక్షణ కల్పించలేని దుస్థితి మౌనంగా వెక్కిరిస్తోంది. కారణాలేమైనా కనబడకుండా వెళ్లిపోతున్నారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల కంటే రెండింతలు వెలుగు రాని ఘటనలు ఉంటాయని చెబుతున్నారు. పరువు పోతుందని, చుట్టాల్లో చులకన అయిపోతామని, నాలుగు రోజుల్లో తిరిగి వచ్చేస్తారని.. ఇలా రకరకాల కారణాలతో సరిపుచ్చుకుంటూ ఏ క్షణంలోనైనా ఇంటి తలుపు తడతారనే ఆవేదనతో ఏడ్చి ఏడ్చి నీరు ఇంకిపోయిన కళ్లతో నిస్తేజ స్థితిలో ఎదురు చూస్తూ బతుకీడ్చే వాళ్లూ ఉన్నారు. అయితే, అదృశ్యమైన వారి ఆచూకీ పసిగట్టడం నిజంగా పోలీసులకు పెద్ద చిక్కుముడే. కానీ విప్పలేనంత కఠినమైన ముడి మాత్రం కాదు. 2016లోని కేసులో ఇప్పటికీ ఆచూకీ లభించలేదు. ప్రతి రోజూ అదృశ్యం కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ఇదిలా ఉండగా యువతుల ఆచూకీని గుర్తించడానికి ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించడంతో కన్నపేగును మళ్లీ చూసుకోగలమన్న గంపెడంత ఆశ బాధిత తల్లిదండ్రుల్లో చిగురిస్తోంది. ఆడపిల్లలు, మహిళల అదృశ్యంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

2016 నుంచి కేసులిలా..

స్టేషన్	బాలురు	బాలికలు	పురుషులు	స్త్రీలు	మొత్తం
అనపర్తి	0	4	12	4	20
బిక్కవోలు	0	0	6	1	7
బొమ్మూరు	1	5	17	16	39
చాగల్లు	1	3	5	8	17
దేవరపల్లి	0	2	5	8	15
ధవళేశ్వరం	0	2	10	9	21
గోకవరం	0	2	4	5	11
గోపాలపురం	0	5	2	3	10
కడియం	0	3	9	7	19
కోరుకొండ	0	4	4	2	10
కొవ్వూరురూరల్	0	1	3	10	14
కొవ్వూరు టౌన్	4	2	20	12	38
నల్లజర్ల	0	2	9	9	20
నిడదవోలు	1	1	5	4	11
పెరవలి	0	2	9	5	16
ప్రకాశంనగర్	2	2	7	2	13
రాజమండ్రి1	0	6	13	17	36
రాజమండ్రి2	0	0	13	8	21
రాజమండ్రి 3	7	9	38	35	89
రాజానగరం	2	5	25	23	55
రంగంపేట	0	1	4	0	5
సమిశ్రగూడెం	1	1	4	8	14
సీతానగరం	1	5	10	9	25
తాళ్లపూడి	0	2	3	6	11
ఉండ్రాజవరం	1	1	12	9	23
మొత్తం	21	70	249	220	560

సెల్‌ఫోన్ భూతం

సెల్‌ఫోన్ల వల్ల ఉపయోగం ఏ మాత్రం ఉందోగానీ.. ఆడవాళ్ల జీవితాలు మాత్రం చిక్కుల్లో పడిపోతున్నాయి. సెల్‌ఫోన్ల వల్ల సంసారాలు కూలిపోతున్నాయి. కొంత మంది వివాహితలు 'ఇతరుల' ఊబిలో కూరుకుపోయి కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. సెల్‌ఫోన్ లేదా వేరే మార్గాల ద్వారా పరిచయమైన వ్యక్తి చెప్పే మాయ మాటలు, తీపి కబుర్లే జీవితం అనుకొని వెళ్లిపోయి..జీవితం ముళ్లకంపలో ఇరుక్కుపోయిందని కొద్ది రోజులకు తెలుసుకొని రోధిస్తున్నారు. మరికొంత మంది భర్త వేధింపులు తాళలేక ఆ నరకం నుంచి బయటకు వెళ్లిపోతున్నారు..అమ్మా నాన్న చదవమంటున్నారని కొంత మంది విద్యార్థినులు..ఇంట్లో స్వేచ్ఛలేదని మరికొంత మంది..మాయమాటలకు లోబడి ఇంకొంతమంది తమ జీవితా లను పణంగా పెడుతున్నారు. విద్యార్థినులు ఇల్లు విడిచి వెళుతున్న కేసుల్లో ఎక్కువగా స్నేహితులు, సెల్‌ఫోన్ల ప్రమేయం ఉంటోందని నిపుణులు చెబుతున్నారు.

ఎక్కడికక్కడ ఆరా ఉండాల్సిందే..

బాలబాలికలు, యువతులు, మహిళల కేసుల్లో ఫిర్యాదు అందిన వెంటనే రంగంలోకి దిగే విధంగా రక్షణ వ్యవస్థలు మెరుగు పడాల్సిన అవసరం కనిపిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం పూర్తిగా ఉపయోగించుకొని త్వరితగతిన ఆచూకీ కనిపెట్టే ఏర్పాట్లు జరగాల్సి ఉంది. ఆచూకీ దొరికిన తర్వాత వారిని సురక్షితంగా తీసుకొచ్చి, తగిన కౌన్సెలింగ్ చేసి తల్లిదండ్రులకు అప్పగించాలి. అలాగే ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి.వాటిలో గ్రామ పోలీస్ ఉన్నారు. వారిని గ్రామం నుంచి బస్సు, ఆటోలు లేదా ఇతర వాహనాల్లో ఊరి నుంచి బయటకు ఒంటరిగా వెళ్తున్న ఆడవారిపై నిఘా పెట్టే విధానం రావాలి. అనుమానం వస్తే ప్రశ్నించి వివరాలు సేకరించారు. కొత్తగా యువకులు, యువతులు కనిపిస్తే ఆరా తీయాలి. రవాణాకు గేట్‌వేలా ఉండే రాజమహేంద్రవరం వంటి సిటీల్లోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద నిఘా పెంచాలి. ఈ పనులకు మహిళా పోలీసులను వినియోగించుకోవడం లేదా మహిళా సిబ్బందిని నియమించుకోవడం చేస్తే మేలు జరిగే అవకాశం ఉంటుంది.

తీరు గమనిస్తూ ఉండాలి : ఎస్పీ జగదీశ్



అదృశ్యం కేసులపై పూర్తిగా దృష్టి సారించాం.రెండు రోజుల కిందట డీజీపీ కూడా స్పష్టమైన ఆదేశాలిచ్చారు. కొన్ని కేసులను క్షుణ్ణంగా అధ్యయనం చేశాం. దాదాపు 20 వరకూ కారణాలను గుర్తించాం.వాటి ఆధారంగా ముందుకు వెళ్లబోతున్నాం.పిల్లల తీరును పెద్దవాళ్లు ఎప్పటికప్పుడు స్కూల్, కళాశాల, పని ప్రదేశాల్లో ఆరా తీస్తూ ఉండాలి. సెల్‌ఫోన్లను, సోషల్ మీడియా వాడకాన్ని గమనిస్తూ ఉం డాలి. ఏదైనా ఇబ్బంది ఉంటే ముందు మంచిగా, జరగబోయే నష్టం గురించి చెప్పి చూడాలి. అప్పటికీ వినకపోతే పోలీసులను ఆశ్రయించవచ్చు.ఈ విషయంలో సమాజం కూడా తన పాత్ర పోషించాలి. ఎవరైనా అనుమానాస్ప దంగా కనిపిస్తే దగ్గరలోని పోలీసులకు సమాచారం ఇవ్వడం బాధ్యతగా గుర్తె రగాలి. అదృశ్యం కేసులను తగ్గించడానికి పోలీసుల వైపు నుంచి అన్ని చర్యలూ తీసుకుంటున్నాం.



అల్లూరు సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల, బత్తుల, కలెక్టర్ ప్రశాంతి తదితరులు

అల్లూరికి ఘన నివాళులు

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 4 : స్వాతంత్ర్యం నా జన్మహక్కని ఆచరణలో చూపిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని పురస్కరించుకుని గురువారం ఉదయం గోదావరి గట్టున గల అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ వేడుకలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి వేడుకలుగా జరిపించాలని నిర్ణయం తీసుకోవడం పట్ల సీఎం చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి ఎస్పీ ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతి, మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బల రామకృష్ణ,ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి,వి.స్వామినాయుడు, అడిషనల్ ఎస్పీలు అనిల్ కుమార్, రాజశేఖర్ రాజు, ఎస్‌బీ డీఎస్పీ ప్రభాకర్, ఏఆర్ డీఎస్పీ టీవీఆర్‌కే కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సూర్య అప్పారావు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్.రఘురాం పాల్గొన్నారు.

బిక్కవోలు ఎంపీపీ జ్యోతిర్మయి రాజీనామా



బిక్కవోలు, జూలై 4 : బిక్కవోలు ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయిశేషుకుమారి తన ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. కొమరిపాలెం-2 ఎంపీటీసీగా ఎన్నికైన జ్యోతిర్మయిని ఎంపీటీసీ సభ్యులందరూ ఎంపీపీగా ఎన్నుకున్నారు. అయితే ఆమె వ్యక్తిగత కారణాల వల్ల మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తూ ఈ నెల 3న జిల్లా పరిషత్ సీఈవోకు రాజీనామా లేఖను పంపడంతో వెంటనే ఆమోదించారు. తాత్కాలిక ఎంపీపీగా బిక్కవోలుకు చెందిన వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావును కొత్త ఎంపీపీగా ఎన్నుకునే వరకూ కొనసాగాలంటూ సీఈవో నుంచి గురువారం తమకు ఉత్తర్వులు వచ్చాయని ఎంపీడీవో వి. విజయలక్ష్మి తెలిపారు. ఇకపై జ్యోతిర్మయి ఎంపీటీసీ సభ్యురాలిగా కొనసాగుతారన్నారు. సీఈవో ఆదేశాల మేరకు త్వరలో ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తామని ఆమె వివరించారు. ఈ నెల 12న ఎంపీపీ బుద్దాల కన్నారావు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరవుతారన్నారు.

జిల్లా ఆసుపత్రిలో.. జలగలు..



జీజీహెచ్‌లో ఎంఎన్‌వోల బరితెగింపు !

- పేద రోగులను జలగల్లా పీడిస్తున్న వైనం
- ఎంఆర్ఐ, సీటీస్కాన్‌లకు డబ్బులు
- ఆర్థోపెడిక్, క్యాజువాలిటీ డ్యూటీ పండగే
- రోజుకు రూ.3 వేలు అదనపు సంపాదన
- వైద్యాధికారుల చర్యలు శూన్యం
- కలెక్టరమ్మా కాస్త ఇటు చూడమ్మా

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 4 : కడియం మండలం వీరవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అనారోగ్యంతో బుధవారం రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు వచ్చాడు. కడియం ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఎంఆర్ఐ చేయించుకోవాలని సూచించడంతో జీజీహెచ్‌కు వచ్చి ఓపీ చీటి రాయించుకున్నాడు. ఎంఆర్ఐ స్కానింగ్ కోసం అక్కడున్న ఒక ఎంఎన్‌వోను సంప్రదించాడు. ఆ ఎంఎన్‌వో రూ.2 వేలు డిమాండ్ చేయడంతో అతనికి ఒక్కసారిగా కళ్లుబైర్లు కమ్మాయి. రోగంతో ఆసుపత్రికి వస్తే డబ్బులు డిమాండ్ చేస్తారా అంటూ ఆ వ్యక్తి ఆసుపత్రి బయట పెద్ద పెద్ద కేకలు వేయడంతో అక్కడున్న మరో ఎంఎన్‌వో అతనికి సర్దిచెప్పాడు. ముందు వైద్యం చేయించుకో అంటూ నచ్చచెప్పి పంపేశాడు..

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో కొందరు ఎంఎన్‌వోల (మేల్ నర్సింగ్ ఆర్డర్లీ) వసూళ్ల భాగోతం. ఇలా ఈ ఒక్క సంఘటన వెలుగు చూసినా .. బయటకు రాని అనేక వ్యవహారాలు జీజీహెచ్‌లోని ఎంఎన్‌వో విభాగంలో నిత్యకృత్యమవుతున్నాయి. ఎంఎన్‌వోల చేతులు తడిపితేనే కానీ రోగులకు వైద్యం అందని పరిస్థితి నెలకొంది. రూ.50, రూ.100 కాదు వేల రూపాయలు డిమాండ్ చేస్తుండడంతో పేదలు, సామాన్యులు వైద్యానికి ముడుపులు ఇచ్చుకోలేక పెద్దాసుపత్రి అంటేనే హడలిపోతున్నారు. ఎంఆర్ఐ, సీటీ స్కాన్, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎక్స్‌రే ఇలా అనేక పరీక్షలకు దర్జాగా డబ్బులు గుంజేస్తున్నారు. ఎంఎన్‌వోలు పేద రోగులను డబ్బుల కోసం జలగల్లా పట్టిపీడిస్తున్నా జీజీహెచ్ అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. అసలు ఎంఎన్‌వోలకు డ్యూటీలు వేసే సూపర్‌వైజర్ పైనా గతంలో అనేక ఆరోపణలున్నా పై అధికారులు పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఒకరికి బదులు మరొకరు ఉద్యోగం చేస్తున్నారంటూ కొద్ది రోజుల కిందట సూపర్‌వైజర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో ఆర్ఎంలతో కమిటీ వేసి విచారణ జరిపించారు. ఆ నివేదిక ఏమైందో, ఏం చర్యలు తీసుకున్నారో కూడా తెలియని దుస్థితి జీజీహెచ్‌లో దాపురించింది. అధికారులు ఎవరిపైనా చర్యలు తీసుకోకపోగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తినే మళ్లీ సూపర్‌వైజర్‌ను చేయడంతో ఎంఎన్‌వోల వసూళ్లకు అధికారులు పరోక్షంగా లైసెన్సు ఇచ్చినట్టయిందని వైద్య ఉద్యోగుల్లో చర్చించుకుంటున్నారు.

ఎంఎన్‌వోలదే కీలకపాత్ర..

తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారు, వృద్ధులు, నడవలేని పరిస్థితిలో వైద్యం కోసం వచ్చే రోగులకు ఎంఎన్‌వోలు తక్షణ సహాయం అందించాల్సి ఉంటుంది. క్యాజువాలిటీ ప్రధాన ద్వారం నుంచి వీల్‌ఛైర్, స్ట్రెచర్ వంటి వాటి ద్వారా వారిని ఆసుపత్రిలోపలకు తీసుకువచ్చి డాక్టర్లకు చూపించాల్సి ఉంటుంది. వైద్యుడు చూసిన తర్వాత అవసరమైతే వారిని ఇన్‌పేషెంట్లుగా అడ్మిట్ రాస్తే ఆయా వార్డుల్లో చేర్పించాల్సి ఉంటుంది. అలాగే ఇన్‌పేషెంట్లుగా ఉన్నవారికి ఎక్స్‌రే, ఈసీజీ, ఎంఆర్ఐ, సీటీ స్కాన్ వంటి టెస్టులు రాస్తే రోగిని అక్కడకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. అలాగే ఓపీలో డాక్టర్‌కు చూపించుకునే వృద్ధులు, నడవలేని వారికి సహాయం చేయాల్సి ఉంటుంది. డాక్టర్‌కు సహాయకునిగాను వ్యవహరించాలి. కట్లు కట్టడం, గాయాలను శుభ్రం చేయడం, ప్రాథమిక వైద్యసేవలు వంటి విధులు నిర్వర్తించాలి. కొందరు ఎంఎన్‌వోలు కేవలం డాక్టర్లకు మాత్రమే సహాయకులుగా వ్యవహరిస్తూ పైరవీలు సాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇన్‌పేషెంట్లు, ఇతర రోగులను టెస్టులకు తీసుకెళ్లి, మరలా తీసుకురావడానికి బాధిత కుటుంబీకులనుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులున్నాయి.

ఆ డ్యూటీలకు మంచి గిరాకీ ..

జీజీహెచ్‌లోని క్యాజువాలిటీ, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ వంటి కీలక విభాగాలతో పాటు మరికొన్ని చోట్ల ఎంఎన్‌వో డ్యూటీలకు విపరీతమైన గిరాకీ ఉంటుంది. ఇక్కడ డ్యూటీలు పడితే ఆ ఎంఎన్‌వోలకు పండగే. ఎందుకంటే ఒకొక్కక్కరు ఎంత లేదన్నా రోజుకు రెండు, మూడు వేలు ఇంటికి పట్టుకెళతారని ఎంఎన్‌వో ఉద్యోగుల్లోనే ప్రచారంలో ఉంది. అందుకే ఇక్కడ డ్యూటీ వేయించుకోవడానికి వారం వారం గోకవరం నుంచి నాటుకోళ్లు, వేట మాంసాలు, కూరగాయలు వంటివి సమర్పించుకోవాల్సిందేననే ప్రచారం జీజీహెచ్‌లో గుప్పుమంటోంది. జీజీహెచ్ ఉన్నతాధికారులు ఒక్కసారి ఎంఎన్‌వోల అటెండెన్స్ రోస్టర్ పరిశీలిస్తే ఈ డ్యూటీల భాగోతం వెలుగు చూసే అవకాశం ఉన్నా అవేమీ పట్టించుకున్న దాఖలా లేవు. దీంతో కొందరు ఎంఎన్‌వోలు దండుకోవడంలో దూకుడు చూపిస్తున్నారు. ఇదేంటని రోగులు, వారి సహాయకులుగాని, ఇతరులు ఎవరైనా అడిగితే వారిపైనా దౌర్జన్యం చేయడానికి కూడా వెనుకాడడంలేదంటే పరిస్థితులు ఎంత అదుపుతప్పాయో అర్థమవుతోంది.

మొత్తం 45 మంది..

రెగ్యులర్, ట్రామాకేర్, జీడీఏలు (జనరల్ డ్యూటీ అటెండెంట్లు) కలిపి మొత్తం 45 మంది ఎంఎన్‌వోలుగా జీజీహెచ్‌లో పనిచేస్తున్నారు. వీరిలో నలుగురు రెగ్యులర్, ఏడుగురు ట్రామాకేర్ మినహా మిగిలిన వారంతా జీడీఏలే ఉన్నారు. జీడీఏల్లో 8 మందిని ఆఫీసులో సహాయకులుగా నియమించారు. మిగిలిన వారంతా ఎంఎన్‌వోలుగా పనిచేస్తున్నారు. ఎంఎన్‌వోలు, జీడీఏలకు నెల రోజులకు ఒకసారి డ్యూటీ రోస్టర్ అమలు చేస్తుంటారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ, 2 నుంచి రాత్రి 8 గంటల వరకూ, రాత్రి 8 నుంచి మర్నాడు ఉదయం 8 గంటల వరకూ షిఫ్టులుగా పనిచేస్తుంటారు. రోస్టర్ ప్రకారం మొదటి షిఫ్టులో సుమారు 20 మంది వరకూ ఎంఎన్‌వోలు పనిచేస్తున్నా రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు లభించడంలేదు సరికదా వీరిలో కొందరిపై తీవ్రమైన డబ్బుల వసూళ్ల ఆరోపణలున్నాయి. నెలలో పదిరోజులకు ముగ్గురు చొప్పున జీడీఏలకు ప్రత్యేకంగా ఎమర్జన్సీ ఓపీ రిజిస్ట్రేషన్ వేస్తున్నా వీరంతా ఎక్కడ విధులు నిర్వర్తిస్తున్నారనేది ప్రశ్నార్థకం.ఈ పరిస్థితుల్లో కాస్త ఇటు చూడమ్మా అంటూ కలెక్టర్‌ను పేద రోగులు దీనంగా వేడుకుంటున్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం, జూలై 4(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈవో కె.వాసుదేవరావు తెలిపారు. ప్రాథమిక, పాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న అన్ని కేటగిరీల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు http://nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైటులో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు సమర్పించాలన్నారు.ఉపాధ్యాయులు అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

న్యాక్‌లో ఉచిత ఎలక్ట్రీషియన్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

ధవళేశ్వరం, జూలై 4 : కేంద్రప్రభుత్వ పీఎంకేవీవై పథకం ద్వారా నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్‌లో(న్యాక్)లో హెల్పర్ ఎలక్ట్రీషియన్ కోర్సును ఉచితంగా నేర్పించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు రీజనల్ కో ఆర్డినేటర్ పి.మురళీధర్ తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాలు వయసు కలిగి కనీసం 10వ తరగతి చదివిని యువతీ యువకులు 34 రోజులు శిక్షణకు అర్హులన్నారు.శిక్షణ సమయంలోఉచిత వసతి, ట్రైనింగ్ మెటీరియల్‌తో పాటు కేంద్రప్రభుత్వ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు.ఈ కోర్సుల్లో చేరే విద్యార్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్‌తో పాటు ఆధార్,రేషన్‌కార్డు,3పాస్‌పోర్టు సైజు ఫొటోలు, బ్యాంక్ అకౌంట్‌తో దరఖాస్తు చేయాలన్నారు. వివరాలకు మాస్టర్ ట్రైనర్ ఎం. కనకదుర్గా మహాలక్ష్మిని 62811 14627 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బంద్ విజయవంతం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 4 : నీట్, నెట్ ప్రవేశపరీక్షలో నష్టపోయిన విద్యార్థులను ప్రభుత్వం ఆదుకోవాలని పీడీఎస్‌యూ, స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (వీ) నాయకులు డిమాండ్ చేశారు. ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండు సమీపంలోని బాలికల ఉన్నత పాఠశాల వద్ద ప్రదర్శన చేశారు. అనంతరం పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తారకేష్ పీడీఎస్‌యూ (వీ) జిల్లా కార్యదర్శి వి.శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యాసంస్థల బంద్ విజయవంతమైందన్నారు. నీట్ ప్రవేశ పరీక్షను మళ్లీ నిర్వహించాలని, అక్రమాలపై వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపించాలని చ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు తన వైఖరి స్పష్టం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు భానుప్రసాద్, మణికంఠ, ఎస్ఎఫ్ఐ నాయకులు భాస్కర్, జ్యోతిర్మయి, సురేష్, కనక, నాగ చైతన్య, లహరి, ఎన్ఎస్‌యూఐ నాయకులు భరత్, సంజయ్, శివాజీ, రోహిత పాల్గొన్నారు.

కొవ్వూరుకు గోదావరి జలాలను అందిస్తాం



ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూలై 4: గోదావరి జలాలను శుద్ధిచేసి పట్టణవాసులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కొవ్వూరు కృష్ణారావు చెరువు నుంచి జగనన్న కాలనీ లేఅవుట్ 1కు వెళ్లే రహదారికి రూ.10 లక్షలు మున్సిపల్ నిధులతో పనులను ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి గురువారం ప్రారంభించారు. ఈ సదర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జగనన్నకాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాయని, అరకొర నిధులతో అరకొర సౌకర్యాలు కల్పించారన్నారు. రోడ్డంతా గుంతలు పడి అధ్వానంగా తయారయ్యిందన్నారు. లేఅవుట్-2లో ఆరికిరేవుల రోడ్డు నుంచి కాలనీ వరకు 20 విద్యుత్ దీపాలను కొత్తగా వేశామన్నారు. త్వరలో గోదావరి జలాలను శుద్ధిచేసి కొవ్వూరు పట్టణ, పరిసర గ్రామాలకు తాగునీరుగా అందిస్తామని ఎమ్మెల్యే అన్నారు. గోదావరి పుష్కరాల సమయం సమీపిస్తున్నందున పట్టణంలో అంచెలంచెలుగా సౌకర్యాలను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, బొండాడ సత్యనారాయణ, పొట్రు మురళీ, డేగల రాము, గంగుమళ్ళ స్వామి, కె.నవ్య, పాల్గొన్నారు.

నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలి

ఎన్ఎస్‌వీ మహర్షి.. కొవ్వూరులో విద్యాసంస్థల బంద్

కొవ్వూరు, జూలై 4: నీట్ పరీక్ష ఫలితాలపై సమగ్ర విచారణ జరపాలని, ఎన్‌టీఏను రద్దు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ మహర్షి, పట్టణ కార్యదర్శి గణేష్‌లు డిమాండ్ చేశారు. జాతీయ బంధనం కార్యక్రమంలో భాగంగా కొవ్వూరులో పాఠశాలలు, కళాశాలలు, బంద్ చేపట్టారు. దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు మే 5న నీట్ పరీక్ష రాశారని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారన్నారు. దేశంలోని 4750 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు సజావుగా జరిగాయని, 6 కేంద్రాల్లో మాత్రమే సమస్య వచ్చిందని చెప్పడం దుర్మార్గమన్నారు. చాలా కేంద్రాల్లో లాంగ్వేజి, కొందరు విద్యార్థులకు వేరే పశ్నాపత్రాలు వచ్చాయన్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించనివారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా మరోసారి నీట్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఫలితాలపై సమగ్ర విచారణ జరపాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీపై సీఎం చంద్రబాబు స్పందించాలన్నారు. కార్యక్రమంలో గణేష్, జాని, సాయి, బహాది పాల్గొన్నారు.

విద్యాసంస్థల మూసివేత

ఉండ్రాజవరం, జూలై 4: దేశవ్యాప్త విద్యాసంస్థలు బంద్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పాఠశాలలు పనిచేయలేదు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. పాఠశాలలను మూయించివేసారు. నీట్‌లో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎస్.కార్తిక్, అశోక్, వెంకట్, మనోజ్, హర్షిత్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు గంటా పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

వివేకానంద వర్ధంతి

కొవ్వూరు, జూలై 4: స్వామి వివేకానంద వర్ధంతి కార్యక్రమాన్ని హిందూ చైతన్య వేదిక ఖండ కన్వీనర్ గూడపాటి శ్రీహరి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి టోల్‌గేట్ సెంటర్‌లో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక ఉపాధ్యక్షుడు వైకే శ్రీనివాస్, పడాల సుబ్బారెడ్డి, కంఠమణి కిషోర్, అనపర్తి గోపాలకృష్ణ, అయోధ్యరాజు, గోపిశెట్టి శివకృష్ణ పాల్గొన్నారు.

ప్రీస్కూల్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే

కొవ్వూరు, జూలై 4: మండలంలోని దొమ్మేరు సావరం అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. గురువారం సీడీపీవో డి.మమ్మీ ఆధ్వర్యంలో దొమ్మేరు సావరం 1,2,3 అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యను అభ్యసించిన ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించి గ్రాడ్యుయేషన్ డేను జరిపారు. అనంతరం గ్రామస్తులకు స్టాప్ డయేరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.వెంకటపద్మిణి, ఏఎన్ఎంలు, ఆశాలు, హెల్త్ సిబ్బంది, సచివాలయ ఎంఎస్‌కెలు పాల్గొన్నారు..

మున్సిపాల్టీలో అవినీతిపై విచారణ జరిపించాలి

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంతా శ్యాం

కొవ్వూరు, జూలై 4: కొవ్వూరు మున్సిపాల్టీలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంతా శ్యాం రవిప్రకాష్ డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ ద్వారా పారిశుధ్య కార్మికులను తీసుకుని నాయకుల ఇళ్ల వద్ద ఇంటి పనులు చేసేందుకు ఉపయోగిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని 113 మున్సిపాల్టీలలో అత్యధికంగా కొవ్వూరులోనే కార్మికుల జీతాలకు రూ.30 లక్షలు ప్రతినెలా ఖర్చు చేస్తున్నారన్నారు. అసలు ఎంతమంది కార్మికులు పారిశుధ్య పనులు చేస్తున్నారో తెలియడంలేదని, పట్టణంలో ఎక్కడ చూసినా అపారిశుద్యమే తాండవిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం పారిశుద్య నిర్వహణను పర్యవేక్షించేందుకు సచివాలయ కార్యదర్శులను నియమించిందని ఇంకా పారిశుధ్య మేస్త్రీలు ఎందుకని ప్రశ్నించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్లు చోరీ

కొవ్వూరు, జూలై 4: ధర్మవరంలోని పంట పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్‌ను దుండగులు పగులగొట్టి వైర్లు దొంగిలించుకుపోయినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. సర్వీస్ నెంబరు 1755 ట్రాన్స్‌పారమ్‌ని దుండగులు ఈ నెల 3న పగులగొట్టి వైర్లు దొంగిలించుకుని పోయారని, దీనిపై విద్యుత్‌శాఖ డి-2 ఏఈ సీహెచ్.శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందజేత



పెరవలి, జూలై 4: ఇటీవల కువైట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రాజమండ్రిలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సాయం చెక్కులు అందజేశారు. ఖండవల్లికి చెందిన మొల్లేటి సత్యనారాయణ, అన్నవరప్పాడుకు చెందిన మీసాల ఈశ్వరుడు కుటుంబ సభ్యులకు గతంలోనే ఆయా గ్రామాల్లో స్వయంగా కుటుంబ సభ్యులను కలుసుకుని ప్రభుత్వ సాయం రూ.5 లక్షలు చొప్పున చెక్కులు, అలాగే ప్రస్తుతం సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేసిన మరో రూ.5 లక్షల చెక్కులను ఇద్దరి కుటుంబ సభ్యులకు అందజేశారు. మొల్లేటి సత్యనారాయణ సతీమణి అనంత లక్ష్మి తరుపున కుమారుడు వెంకటసాయి, మీసాల ఈశ్వరుడు.. మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి చేతుల మీదుగా చెక్కులను అందుకున్నారు.

కానూరులో ఉచిత వైద్య పరీక్షలు

పెరవలి, జూలై 4: కానూరులో గెయిల్ ఇండియా ఆధ్వర్యంలో ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. 70 మందికి డాక్టర్ ఉమాచంద్ ఆధ్వర్యంలో గెయిల్ పారా మెడికల్ సిబ్బంది వైద్య పరీక్షలు జరిపారు. డాక్టర్ ఉమాచంద్ మాట్లాడుతూ ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ఈ విధంగా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడానికి గెయిల్ సంస్థ ముందుకొచ్చిందన్నారు.

దేవరపల్లి ట్రక్ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ కిశోర్‌బాబు

గోదావరిలో దూకి ఆత్మహత్య

కొవ్వూరు, జూలై 4: గోదావరిలో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్ఐ జుబేర్ మహ్మద్ తెలిపారు. దేవరపల్లి ట్రక్ ఆటో యూనియన్ ప్రెసిడెంటు మెరిపో కిషోర్‌బాబు(33) ఈ నెల 3న ఇంట్లో భార్య, తల్లిదండ్రులతో గొడవపడి బైక్‌పై బయటకు వచ్చేశాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో బంధువులు వెతకడం ప్రారంభించారు. కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి 138వ స్తంభం వద్ద కిషోర్‌బాబు బైక్ కనిపించింది. దీంతో గోదావరి నదిలో జాలర్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని నది నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి పెదనాన్న కొడుకు మెరిపో ఆదియ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా కిషోర్‌బాబుకు భార్య, ఆరేళ్ల కుమారుడు ఉన్నారు.

గ్రామాల్లో నీటి నాణ్యత పరీక్షలు

కొవ్వూరు, జూలై 4: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని ఈవోపీఆర్డీ కె.ఉమామహేశ్వరశర్మ అన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా గురువారం ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ టి.రాజాతిలక్ ఆధ్వర్యంలో మండలంలోని ఆరికిరేవుల, కుమారదేవం, చిడిపి గ్రామాల్లో తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. గ్రామాల్లోని అన్ని బోర్లు తనిఖీ చేసి, పరీక్షలు జరిపారు. డయేరియాను అరికట్టేందుకు, వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జె.నరేంద్రబాబు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, సిబ్బంది పాల్గొన్నారు



నిడదవోలులో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి దుర్గేష్



పెరవలి: అజ్జరంలో మాట్లాడుతున్న కందుల దుర్గేష్



కొవ్వూరులో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

యువతకు స్ఫూర్తి అల్లూరి

- రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్
- ఊరూవాడా సీతారామరాజు జయంతి వేడుకలు
- మన్యం వీరుడికి నాయకులు, అధికారుల నివాళి

నిడదవోలు, జూలై 4: బానిస సంకెళ్ళతో ఉన్న దేశ ప్రజలకు స్వేచ్ఛా వాయువులను ప్రసాదించాలనే లక్ష్యంతో దేశానికి స్వాతంత్రం తీసుకురావాలన్న తొలి రోజుల్లో పోరాటానికి నాయకత్వం వహించిన నాయకుడు అల్లూరి సీతారామరాజని, ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు నడవాలన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పలుచోట్ల గురువారం ఘనంగా నిర్వహించారు. నిడదవోలులోని గాంధీనగర్‌లో అల్లూరి విగ్రహానికి మంత్రి దుర్గేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన్యంలో గిరిజనుల సమస్యలు అర్థం చేసుకుని వాటిని పరిష్కరించే దిశగా బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాటం చేసిన విప్లవ వీరుడు అల్లూరి అని అన్నారు. స్వాతంత్ర పోరాటంలో అతివాతం, మితవాదం అనే రెండు భావజాలాలతో నాయకులు ఉండేవారని, అతివాద మార్గాన్ని సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, బాలాగంగాధర్ తిలక్ వంటి నాయకులు ఎన్నుకుని ముందుకు నడిపించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, డాక్టర్ బూరుగుపల్లి అప్పారావు, బండి సత్యనారాయణ, రంగా రమేష్, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని అజ్జరం, ఖండవల్లి గ్రామాల్లో జరిగిన అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జన్మించిన అల్లూరి విశాఖపట్టణం మన్యం ప్రాంతంలో గిరిజన హక్కుల కోసం పోరాడిన యోధుడని ప్రశంసించారు. బ్రిటీష్‌వారి నిరంకుశ పరిపాలన నుండి ప్రజలను రక్షించాలన్న ఏకైక లక్ష్యంతో పోరాడి ప్రాణాలర్పించారన్నారు. ప్రస్తుత యువత ఆయన అడుగు జాడల్లో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరులో క్షత్రియ సేవాసంఘం అధ్యక్షుడు చెరుకూరి సాయిరాజు ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం పోరాటంచేసిన మహనీయుల చరిత్రలను పాఠ్యాంశాలుగా చేర్చాలని, వారి జయంతిలను ప్రభుత్వమే అధికారికంగా చేపట్టాలన్నారు. మహాత్మగాంధీ, భగత్‌సింగ్, సుభాష్‌చంద్రబోస్, పొట్టి శ్రీరాముల వంటి వారికి కులాలను అంటగట్టడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ, బీవీ ముత్యాలరావు, బొండాడ సత్యనారాయణ, పొట్రు మురళీ, డేగల రాము, సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు, గంగుమళ్ల స్వామి పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు ఆధ్వర్యంలో జరిగిన అల్లూరి జయంతి కార్యక్రమంలో జువ్వల రాంబాబు, పెనుమాక జయరాజు, దగ్గు రాదాకృష్ణ, రిక్షా, జట్టు కార్మికులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అల్లూరి చిత్రపటానికి తహశీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు పూలమాలలతో నివాళులర్పించారు. స్వతంత్ర పోరాటంలో తనవంతుగా సైన్యాన్ని తయారు చేసి బ్రిటీష్ వారి వెన్నులో వనుకు పుట్టించిన యోధుడు అల్లూరి అని అన్నారు. ఆయన ధైర్యం మనకు ఆదర్శమని, గోదావరి జిల్లాలో పుట్టిన ఆయన జయంతిని ప్రభుత్వం గుర్తించినందుకు ఏఎస్‌వో జోడాల ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కిషోర్, సీతారామరాజు, సురేష్, శ్రీలక్ష్మి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

గోపాలపురం: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి తహశీల్దార్ వనజాక్షి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుజాతి పరాక్రమాన్ని ప్రపంచానికి చాటిన యోధుడు సీతరామరాజని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా కోర్టును ఏర్పాటు చేసి తెల్లదొరల కంటికి నిద్రలేకుండా చేసిన వీరుడని కొనియాడారు. అలుపెరగని యోధుడిగా పోరాడటంతో గిరిజనులకు దేవుడయ్యాడన్నారు. నేటి యువత అల్లూరిని స్ఫూర్తిగా తీసుకుని ప్రశ్నించే స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని వెలగదుర్రు, వడ్లూరు, చిలకపాడు తదితర గ్రామాల్లో అల్లూరి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెలగదుర్రులో క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి స్వీట్స్ పంచారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముదునూరి రవీంద్రరాజు, నారాయణరాజు, కేశవరాజు, యాతం రాజు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి

నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్

దివాన్‌చెరువు, జూలై 4: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆదికవి నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. నన్నయ వర్సిటీలో గురువారం అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి రిజిస్ట్రార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారత స్వాతంత్రోద్యమంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సీతారామరాజు చేసిన సాయుధ పోరాటం గొప్పదని, తెలుగువారి పౌరుషానికి, దేశభక్తికి నిదర్శనమన్నారు.విద్యార్థులంతా దేశభక్తిని పెంపొందించుకుని సమాజ హితం కోసం జీవించాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు పి.సురేష్ వర్మ, కె.శ్రీరమేష్, వై.శ్రీనివాసరావు, డి.జ్యోతిర్మయి. వి.పెర్సిస్, పి.వెంకటేశ్వరరావు, ఎస్.లింగారెడ్డి, జ్యోతి, చంద్రకళ, విజయకుమారి, కార్యక్రమం కోఆర్డినేటర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నన్నయ రిజిస్ట్రార్ సుధాకర్



తాళ్లపూడిలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహశీల్దార్



గోపాలపురంలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహశీల్దార్ వనజాక్షి



ఉండ్రాజవరం : వెలగదుర్రులో అల్లూరి నివాళులు

ఘనంగా రంగా జయంతి

- నివాళులర్పించిన పలువురు నాయకులు



యర్నగూడెంలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

నిడదవోలు, జూలై 4: వంగవీటి మోహన రంగ ఏ ఒక్క కులానికో వర్గానికో చెందిన వ్యక్తి కాదని బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రంగ జయంతిని పలుచోట్ల గురువారం నిర్వహించారు. మంత్రి షెడ్యూల్‌లో కార్యక్రమం లేకపోయినా.. నిడదవోలులో అల్లూరి జయంతి వేడుకల్లో పాల్గొని వెళుతున్న ఆయనకు రంగ జయంతి నిర్వహిస్తున్నారని ఫోన్ రావడంతో ఆ కార్యక్రమానికి హాజరై రంగ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో శివ నాయుడు, రంగా రమేష్, బాలు, కొమ్మిన వెంకటేశ్వరరావు, తిరుపతి సత్యనారాయణ, గంటా శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని దేవరపల్లి, యర్నగూడెంలో రంగా విగ్రహాలకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఘనంగా నివళులర్పించారు. కేకులు కట్ చేసి స్వీట్లు పంచారు. రంగా రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్రవేసి ఎందరికో ఆశాజ్యోతిగా నిలిచారని, ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు, టీడీపీ నాయకులు పెనుమత్స సుబ్బరాజు, బొల్లిన శ్రీధర్, హరినాథ్, రాజేంద్రబాబు, జనసేన నాయకులు కాట్నం గణేష్ కవల సీతారత్న సూర్యకుమారి, నాయుడు దుర్గాప్రసాద్, తాతాబ్బాయి, వెంకన్న, అడబాల మణికంఠ, కడిమి రాజు, కవల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరు మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద రంగా విగ్రహానికి కాపు సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగళ్ళపాటి శ్రీనివాస్, షైపాల రాంబాబు, మారిశెట్టి వెంకటేశ్వరరావు, కొయ్యల బాస్కరరావు, అడ్డూరి సుబ్బారావు, మురుకొండ శ్రీనివాస్, యాళ్ల నరసింహ రావు, ఆవుల వాసు పాల్గొన్నారు.

తాళ్లపూడి: అన్నదేవరపేటలో జనసేన పార్టీ నాయకుడు మేణ్ణి సత్తిబాబు ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి యువగళం నాయకుడు కాకర్ల సత్యేంద్ర పాలభిషేకం చేశారు. మలకపల్లిలో జనసేన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు గంటా కృష్ణ, తోకనాటి ముత్యాల రావు, మద్దిపాటి ప్రకాశరావు, కాపు సంఘ నాయకుడు రాగు వీర్రాజు రంగా విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో అయితం మణికంఠ, కాకర్ల సురేష్, అవుదు కృష్ణ, బరిగంటి శ్రీను, నాయన బూరయ్య, ఏసులంక తాతారావు, దేవన సత్యనారాయణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని చివటంలో రంగా విగ్రహానికి పలు వురు నాయకులు పూలమాలలతో నివాళులర్పించారు. కులమతాలకు అతీతంగా పేదలకు సాయం చేసే వ్యక్తి రంగా అని కొనియాడారు. కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో కాపు సంఘ నాయకుడు వేమన శ్రీనివాసరావు, కొరారు సత్యనారాయణ, వేముల సత్యనారాయణ, కుదప రమేష్, ఉమ్మిడి వెంకటేశ్వరరావు, జి.చినవెంకన్న, కె.దినేష్, డి.మునిరాజు, సీహెచ్ కుమారస్వామి పాల్గొన్నారు.



నల్లజర్ల: రంగా అభిమానులైన ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, ఉన్నమట్ల రామకృష్ణ, ఉన్నమట్ల సత్య, కొత్తపల్లి హరిబాబు, కోడూరి తరుణ్ కృష్ణం పాలెంలో అంబేడ్కర్ వృద్ధాశ్రమానికి వెళ్లి వృద్ధులతో కేక్ కట్ చేయించి, వారికి భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీపురుగూడెంలో రెండు చోట్ల వంగవీటి జయంతి నిర్వహించారు. బాణసంచా కాల్చి, స్థానికులకు స్వీట్లు పంచారు.

డయేరియాపై అంగన్‌వాడీలకు అవగాహన

నల్లజర్ల, జూలై 4: డయేరియాపై అంగన్‌వాడీలు మరింత అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో బాలత్రిపుర సుందరి అన్నారు. గురువారం నల్లజర్ల అంగన్‌వాడీ ప్రాజెక్ట్ కార్యాలయంలో డయేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లలకు వేడి గుడ్డు, భోజనం వడ్డించాలన్నారు. వండిన ప్రతి పదార్థంపై మూతలు ఉండే విధంగా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగే విధంగా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

చాగల్లు, జూలై 4: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మెరుగైన పారిశుధ్యం కోసం పంచాయతీ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని డీఎల్‌పీవో దాసరి రాంబాబు అన్నారు. చాగల్లు పంచాయతీ పరిధిలో జరుగుతున్న రోజు వారి స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాలైన తాగునీటి సరఫరా, క్లోరినేషన్, ట్యాంకుల నిర్వహణ, తడిచెత్త, పొడి చెత్త సేకరణ, డ్రైన్‌ల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో అవగాహన సమావేశం నిర్వహించి జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి ఆర్.శ్రావణ్‌కుమార్, కార్యదర్శి ఎల్.రవికుమార్ పాల్గొన్నారు.

7న జిల్లా చదరంగం పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 4: గాంధీపురం శ్రీ గౌతమి స్మార్ట్ స్కూల్లో బాల బాలికలకు ఆదివారం అండర్ 17, 19, బాల బాలికలకు చదరంగం పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లా చదరంగ సంఘం కార్యదర్శి జి.వి.కుమార్ తెలిపారు. అండర్ 19 విభాగంలో గెలుపొందిన నలుగురు 18,19 తేదీల్లో నంద్యాలలో జరిగే రాష్ట్ర పోటీలకు, అండర్ 17 విభాగంలో మొదటి ఇద్దరు విజేతలు విజయనగరంలో జరిగే రాష్ట్ర పోటీలకు తూర్పుగోదావరి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు, తమ పేర్లను www.apchess.org వెబ్‌సైట్ ద్వారా నమోదు చేయించుకోవాలని కార్యదర్శి కోరారు. వివరాలకు సెల్ 98483 74133ని సంప్రదించాలని కోరారు.

28న ఎస్పీ బాలు స్మారక మధుర గీతాలాపన

రాజమహేంద్రవరం కల్చరల్/ధవళేశ్వరం, జూలై 4: రాజమహేంద్రవరం రాకా సాంస్కృతిక సంస్థ, గోదావరి కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, ఎమెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని వారి వారి స్వగృహాల్లో ఘనంగా సత్కరించారు. ఈ నెల 28న స్థానిక విక్రమహాల్లో తాము సంయుక్తంగా నిర్వహించే ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మారక మధుర గీతాల కార్యక్రమానికి వారిద్దరినీ ఆహ్వానించగా అంగీకరించనట్టు తెలిపారు. సాంస్కృతికంగా ఎంతో వైవిధ్యం కలిగిన మన ప్రాంతానికి మన కళాకారులు పేరు ప్రఖ్యాతులు తెచ్చి, సాంస్కృతిక సాహిత్యపరంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

మాజీ ఎంపీ ప్రచార రథం

మాజీ ఎంపీ ప్రచార రథం కాల్చేసింది వైసీపీ కార్యకర్తే

- 4 అగ్గిపుల్లలు.. దోమల చక్రం ముక్క.. పెట్రోలుతో తగలబెట్టేశాడు
- ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిషోర్‌కుమార్ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కిషోర్‌కుమార్

రాజమహేంద్రవరం, జూలై 4(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రచార రథాన్ని వైసీపీ కార్యకర్త.. అదీ భరత్ తండ్రి మార్గాని నాగేశ్వరరావు ముఖ్య అనుచరుడే తగలబెట్టేశాడు. దీనికి ప్రొఫెనల్ క్రిమినల్ కంటే తెలివిగా ఆలోచన చేయడం పోలీసులను కూడా ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ మేరకు వివరాలను ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిషోర్‌కుమార్ వెల్లడించారు. రాజమహేంద్రవరం వీఎల్ పురానికి చెందిన దంగేటి శివ కొన్నేళ్ల నుంచి వైసీపీ కార్యకర్తే కాకుండా మార్గాని నాగేశ్వరరావుకు ముఖ్య అనుచరుడు. భరత్ కార్యాలయం ఉన్న మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోనే ఎక్కువ సమయం గడిపేవాడు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో భరత్ ఓడిపోవడంతో ఆవేదన చెందాడు. ఎలాగైనా ఏదోకటి చేసి టీడీపీ వాళ్లపైకి నెపం నెట్టేయాలని, భరత్‌పై ప్రజల్లో సానుభూతి వచ్చే విధంగా చేయాలని పథకం వేశాడు. ఈ క్రమంలో గత నెల 28న శివ మరి కొంతమంది కలిసి రాత్రి 10గంటల వరకూ మార్గాని ఎస్టేట్స్‌లోని రచ్చబండ వద్ద మద్యం తాగారు. తర్వాత ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. రాత్రి 10.30 గంటల ప్రాంతంలో తన బైక్ నుంచి ఒక ప్లాస్టిక్ కవర్లోకి పెట్రోలు తీశాడు. ఒక దుకాణంలో దోమల చక్రం, అగ్గిపెట్టె కొన్నాడు. దోమల చక్రం చిన్న ముక్క విరిపి దానికి నాలుగు అగ్గిపుల్లలు వెలిగే కొసను ప్లాస్టిక్ తాడుతో కట్టాడు. వీటిని తీసుకొని ప్రచార రథం వద్దకు వెళ్లాడు. ఎదుటవైపు టైరుపై పెట్రోలు ఉన్న కవర్‌ని ఉంచి.. దానిపై అగ్గిపుల్లలు కట్టిన భాగం పెట్టాడు. మరొకవైపు దోమల చక్రం ముక్కను వెలిగించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇదంతా ఒక నిమిషంలో చేసేశాడు. దోమల చక్రం వెలుగుతూ వచ్చి అగ్గిపుల్లలు మండి ఆపై పెట్రోల్ కవర్‌కి నిప్పు అంటుకొని పెట్రోల్‌తో మంటలు చెలరేగాయి. ఇవన్నీ టైరుపై ఉండడంతో మరింత వేగంగా మంటలు వ్యాపించాయి. దీంతో ప్రచార రథం దగ్ధమైందని డీఎస్పీ వివరించారు. తర్వాత శివాజీకి స్నేహితుడు బాలు ఫోన్ చేసి భరత్ ఆఫీసు వద్దకు పోలీసులు ఎందుకు వచ్చారని ప్రశ్నించాడన్నారు. తాను విషయం ఆరా తీస్తానని చెప్పి మార్గాని నాగేశ్వరరావుకు శివాజీ ఫోన్ చేశాడన్నారు. ఏమైందో తెలుసుకుంటానని చెప్పిన నాగేశ్వరరావు.. ఐదు నిమిషాల తర్వాత శివాజీకి ఫోన్ చేసి ఎవరో ప్రచార రథానికి నిప్పు పెట్టి కాల్చేశారని చెప్పారని డీఎస్పీ తెలిపారు. శివాజీపై అనుమానం రాకుండా వ్యవహ రించాడని పేర్కొన్నారు. నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 435 కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు. అతడిపై చాలా ఏళ్ల క్రితం ఓ కేసు ఉన్నట్లు తెలుస్తోందని.. పూర్తి వివరాలు ఆరా తీస్తున్నామన్నారు. అభిమానం, సానుభూతి సంపాదించడం తదితర కారణాలతో ఇలాంటి నేరాలకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కేసును మూడు రోజుల్లో ఛేదించిన బొమ్మూరు సీఐ ఎండీ ఉమర్, ఎస్ఐ బి.శ్రీను, ఆర్.అంకారావు, కె.జగన్మోహన్‌రావు(కొవ్వూరు టౌన్), హెచ్‌సీలు పి.వెంకటేశ్వరరావు(బొమ్మూరు), కె.సురేశ్‌బాబు(అనపర్తి), కానిస్టేబుళ్లు కె.సురేశ్‌బాబు(బొమ్మూరు), కె.తిరుమల యాదవ్(బిక్కవోలు) బృందాన్ని ఎస్పీ జగదీశ్ ప్రత్యేకంగా అభినందించారు.

మైండ్ బ్లోయింగ్ ప్లాన్

కేసును ఛేదించడానికి పోలీసులు చాలా కష్టబడాల్సి వచ్చింది. భరత్ కార్యాలయానికి దూరంగా ఉన్న ఒక షెడ్డులో ఈ రథాన్ని ఉంచారు. అక్కడి సీసీ కెమెరాలు అంతదూరం పని చేయవు. దీంతో ఓ స్కూలు వద్ద ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా కేసును ఛేదించారు. గతంలో తమ దర్యాప్తుల్లో ఎన్నడూ చూడని ప్లాన్‌ని నిందితుడు, వైసీపీ కార్యకర్త దంగేటి శివాజీ వేయడం చూసి నివ్వెరపోయారు. యూట్యూబ్‌లో వీడియోలు వెతికి ఈ ప్లాన్ ఎంచుకున్నట్లుగా తెలుస్తోంది. మామూలు ప్లాస్టిక్ కవరైతే వెంటనే కాలిపోతుందని అల్యూమినియం ఫాయిల్ కవర్‌లో పెట్రోలు నింపుకున్నాడు. దానిని వెలిగిస్తే ఒక్కసారిగా పెద్ద మంటలు వచ్చి జనం గుమిగూడతారని దోమల చక్రానికి అగ్గిపుల్లలు కట్టాడు. ఆ దోమల చక్రం నెమ్మదిగా వెలుగుతూ అగ్గిపుల్లల వద్దకు వచ్చే సరికి సమయం పడుతుంది. దీంతో ఎవరికీ అనుమానం రాదని ప్లాన్ వేశాడు. ఈ సరంజామాను వ్యానుపై పెడితే పెద్దగా ఫలితం ఉండదని టైరుపై ఉంచాడు. టైరు రబ్బరు కావడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. కాగా.. 28 రాత్రి ఘటన జరగ్గా 2వ తేదీన పోలీసులకు వైసీపీ నగరాధ్యక్షుడు అడపా శ్రీహరి ఫిర్యాదు అందజేయడంతో అప్పట్లోనే అనుమానాల వ్యక్తం కావడం గమనార్హం.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజీమాల్ వై.స్క్రీన్ 1	మనమే
వై.స్క్రీన్2	మహారాజ
దేవిశ్రీ(గాయత్రి)	హరోంహర
అనన్య	తమ్ముడు
నిడదవోలు	
వీ మ్యాక్స్	కల్కి
రాధాకృష్ణ	కల్కి
శ్రీగణపతి	కల్కి
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	గంగం గణేశా
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---